RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ తల్లి

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా విజన్
18వ వసంతంలోకి

ఎడిటర్ : బూర్ల వెంకన్న కరీంనగర్ సంపుటి :17 సంచిక :320 మంగళవారం, మార్చి 17, 2026, పేజీలు -20 వెల :5/-

# ప్రతి పౌరుడికి అభివృద్ధిలో భాగస్వామ్యం

## తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తొలిరోజు గవర్నర్ ప్రసంగం

● ఆమేరకు తెలంగాణ బడ్జెట్ రూపకల్పన ● 2047 తెలంగాణ రైజింగ్ దిశగా అడుగులు ● 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం ● దేశ జీడీపీకి తెలంగాణ 4.99 శాతం అందిస్తోంది ● ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా రాష్ట్ర అభివృద్ధి ● గ్లోబల్ సమ్మిట్ ద్వారా 5 లక్షల 72 వేల కోట్ల పెట్టుబడులు ● హిల్ట్ పాలసీ ద్వారా పరిశ్రమల భూముల బదలాయింపు ● రాష్ట్రంలోని ఏదలందరికీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ● మూసీనది ప్రక్షాళనకు పథకాల రచన చేపట్టాం ● ఐటీ ఎగుమతులు రూ.3.13 లక్షల కోట్లకు చేరిక ● తొలుత తెలుగులో ప్రసంగం ప్రారంభించిన గవర్నర్ శుక్లా



**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** ప్రతిపౌరుడు అభివృద్ధిలో భాగస్వామిగా ఉండేలా బడ్జెట్‌ను రూపొందించినట్లు తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. 2047 తెలంగాణ రైజింగ్ దిశగా అడుగులు వేస్తున్నట్లు గవర్నర్ శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. అసెంబ్లీలో తొలిసారి తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఆపై గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఉభయసభలను ఉద్దేశించి తెలుగులో ప్రసంగించారు. తొలుత గవర్నర్ తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించడంవిశేషం. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యమని గవర్నర్ పేర్కొన్నారు. ప్రస్తుతం దేశ జీడీపీకి తెలంగాణ 4.99 శాతం అందిస్తోందని - మిగతా2లో

# సమావేశాల్లో ఎమ్మెల్యేలు హాజరు కావాల్సిందే

## సిఎల్‌పి సమావేశంలో సిఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు



**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** శాసనసభ సమావేశాలకు సభ్యులంతా తప్పనిసరిగా హాజరు కావాలని పార్టీ ఎమ్మెల్యేలను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వివిధ అంశాల పై ఎమ్మెల్యేలు అవగాహన పెంచుకోవాలని, వారికి మంత్రులు సమయమివ్వాలని సూచించారు. తెలంగాణ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో సీఎల్పీ సమావేశమైంది. ఈ సందర్భంగా పలు అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి పార్టీ నేతలకు దిశా - మిగతా2లో

# ముంద్రా పోర్టుకు చేరుకున్న శివాలిక్




**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ భారత్‌కు ఊరటనిచ్చే వార్త అందింది. ఖతార్ నుండి లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్‌తో బయలుదేరిన భారీ ట్యాంకర్ 'శివాలిక్', సురక్షితంగా గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు చేరుకుంది. హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పతాక స్థాయిలో ఉన్న సమయంలో ఈ నౌక రాక ప్రాధాన్యత - మిగతా2లో

# శాసనసభ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం

## పుష్పాంజలి ఘటించిన గవర్నర్, సిఎం, మంత్రులు

**తెలంగాణ పత్రిక ప్రతినిధి :**

శాసనసభ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. పునరుద్ధరించిన మండలి భవనం ముందు తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

- మిగతా2లో



# మార్చి 31వరకు తెలంగాణ అసెంబ్లీ



**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 31 వరకు జరగనున్నాయి. ఈ మేరకు బీఏసీ సమావేశంలో నిర్ణయించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షత బీఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశాల నిర్వహణ పై కీలక నిర్ణయం తీసుకున్నారు. మార్చి 16 నుంచి మార్చి 31 వరకు సమావేశాలను నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు. - మిగతా2లో


# ఆరు గ్యారెంటీల పై అసెంబ్లీలో నిలదీస్తాం

**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు ఠంచనుగా పడేదని గుర్తుచేశారు. అదే కాంగ్రెస్ పాలనలో పంటలు ఎండిపోతున్నా రైతుబంధు దిక్కులేదని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్తూపానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ శాసనసభ సమావేశాలకు ముందు అమరవీరుల స్థూపానికి నివాళులర్పించామని తెలిపారు. - మిగతా2లో



# కవి నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** తెలంగాణ కవి, రచయిత నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు 2025 లభించింది. ఆయన కవితా సంపుటి 'అనిమేష' లో కరోనా కాలంలో ప్రపంచం ఎదుర్కొన్న సంక్షోభాలను, మానవ సంబంధాల విచ్ఛిన్నతలను హృద్యం గా చిత్రీకరించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి ఛైర్మన్‌గా, మంజీరా రచయితల సంఘం ద్వారా తెలుగు సాహిత్యానికి కొత్త ఊపునిచ్చి, తెలంగాణ ఉద్యమానికి తన కవిత్వం- మిగతా2లో






# ప్రజలకిచ్చిన హామీల పై స్పష్టత ఏదీ



**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** గవర్నర్ ప్రసంగంలో ప్రజలకు ఇచ్చిన హామీల గురించి ఎలాంటి ప్రస్తావన లేదని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. రైతుల ఇబ్బందులు, ఉద్యోగాల భర్తీ గురించి లేదని, ఉద్యోగుల - మిగతా2లో

# జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడుతారని ప్రచారం

## స్పందించిన జగిత్యాల ఎమ్మెల్యే

**తెలంగాణ పత్రిక ప్రతినిధి**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి పార్టీ నుంచి వెళ్లిపోవాలని ఎవరూ కోరుకోవడం లేదని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంలో తాను ఎల్ రమణతో కలిసి పని - మిగతా2లో





# సమావేశాల నిర్వహణ పై హరీష్ అసంతృప్తి

**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** తెలంగాణ శాసనసభ బ్జడెట్ సమావేశాల నిర్వహణ తీరుపై బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్‌లో పనిదినాలు - మిగతా2లో

# ఎమ్మెల్యేలు, ఎంపీలు డ్రగ్స్ పరీక్షలు చేయించుకోవాలి

**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్ పై జరిగిన దాడి, అందులో ఆయనతో పాటు ఏపీకి చెందిన ఓ ఎంపీకి కూడా డ్రగ్స్ టెస్ట్‌లో పాజిటివ్‌గా తేలడం రాష్ట్ర - మిగతా2లో



తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA
తెలుగు దిన పత్రిక



## ముంద్రా పోర్టుకు చేరుకున్న శివాలిక్

-మొదటిపేజీ తరువాయి

ఈ నౌక రాక ప్రాధాన్యత సంతరించుకుంది. ఇరాన్, అమెరికా మధ్య ఘర్షణల కారణంగా ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన హోర్ముజ్ జలసంధి మూసివేత ముప్పు పొంచి ఉంది. ఇరాన్ ఈ మార్గాన్ని అడ్డుకుంటామని హెచ్చరించిన నేపథ్యంలో,గల్ఫ్ దేశాల నుండి భారత్‌కు చమురు,గ్యాస్ సరఫరా నిలిచిపోతుందేమోనన్న ఆందోళన నెలకొంది. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో 'శివాలిక్' నౌక సురక్షితంగా ప్రయాణించి లక్ష్యాన్ని చేరుకోవడం భారత ఇంధన భద్రతకు సానుకూల సంకేతంగా నిపుణులు భావిస్తున్నారు. శివాలిక్ ఎల్‌పిజి ట్యాంకర్ ఖతార్‌లోని రాస్ లఫ్ఫాన్ నుండి వేల టన్నుల ఎల్‌పీజీని మోసుకొచ్చింది.ఉద్రిక్తతల దృష్ట్యా భారత నావికాదళం గల్ఫ్ ప్రాంతంలో నిఘాను పెంచిన సంగతి తెలిసిందే. భారతీయ నౌకల ప్రయాణాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ భద్రతాపరమైన భరోసా కల్పిస్తోంది. గుజరాత్‌లోని అదానీ ముంద్రా పోర్టులో ఈ గ్యాస్ అన్-లోడింగ్ పక్రియ ప్రారంభమైంది. ఇది దేశీయ గ్యాస్ అవసరాలకు ఎంతో కీలకం. ప్రపంచ వ్యాప్తంగా రవాణా అయ్యే చమురులో సుమారు 20 శాతం ఈ జలసంధి ద్వారానే సాగుతుంది. ఇరాన్-అమెరికా యుద్ధం వల్ల ఈ మార్గం మూసుకు పోతే అంతర్జాతీయంగా చమురు ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉంది.

## శాసనసభ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర శాసనసభ ఆవరణలో రాష్ట్ర ఆత్మగౌరవ చిహ్నంగా నూతనంగా రూపొందించిన 'తెలంగాణ తల్లి' విగ్రహాన్ని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా వైభవంగా ఆవిష్కరించారు. ఈ చారిత్రక ఘట్టం రాష్ట్ర ప్రముఖులు, మంత్రుల సమక్షంలో అత్యంత వేడుకగా జరిగింది. అనంతరం విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముందు ఒక ప్రత్యేక కార్యక్రమం జరిగింది. అసెంబ్లీ ఆవరణలో ఉన్న జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాల వద్ద గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఘనంగా నివాళులర్పించారు. దేశానికి, సమాజానికి వారు చేసిన అసమాన సేవలను ఈ సందర్భంగా నేతలు స్మరించుకున్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సభను ఉద్దేశించి మాట్లాడారు. ఈ విగ్రహం కేవలం ఒక నిర్మాణం మాత్రమే కాదని, ఇది తెలంగాణ ప్రజల పోరాట పటిమకు, సంస్కృతికి, ఆత్మ గౌరవానికి నిలువెత్తు ప్రతీక అని ఆయన అభివర్ణించారు.

## మార్చి 31 వరకు తెలంగాణ అసెంబ్లీ

-మొదటిపేజీ తరువాయి

సోమవారం ఉదయం గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగంతో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం అనంతరం స్పీకర్ సభను మంగళవారం వాయిదా వేశారు. అనంతరం స్పీకర్ ఛాంబర్‌లో బీఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై చర్చించారు. మార్చి 17, 18న గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదం తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. ఈనెల 20న అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెను ప్రవేశపెట్టనుంది. ఆపై 23 నుంచి 26 వరకు బడ్జెట్‌పై చర్చలు జరపనున్నారు. మార్చి 31న ద్రవ్య వినిమియ బిల్లుపై చర్చ జరగనుంది. అలాగే ఉగాది, రంజాన్, శ్రీరామనవమికి అసెంబ్లీకి సెలవులు ప్రకటించనున్నారు. బీఏసీ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, విప్ బీర్ల ఐలయ్య హాజరయ్యారు. బీఆర్ఎస్ నుంచి హరీశ్ రావు, కేపీ వివేక్ హాజరవగా.. బీజేపీ నుంచి మహేశ్వర్ రెడ్డి, ఎంఐఎం నుంచి అక్బరుద్దీన్, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు సమావేశంలో పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీల పై అసెంబ్లీలో నిలదీస్తాం

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. రెండున్నరేళ్లవుతున్నా ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించలేదని విమర్శించారు. ఆనాడు గవర్నర్‌తో చట్టబద్ధత కల్పిస్తామని చెప్పించారని తెలిపారు. పంటల వేసే నాటికి కేసీఆర్ రైతుబంధు నిధులు వేసేవారని కేటీఆర్ గుర్తుచేశారు. రాహుల్ బంధు కాదు.. రైతుబంధు వేయాలని కోరారు. రైతులకు వెన్నుపోటు.. రాహుల్‌కు వెయ్యి కోట్లా అని నిలదీస్తామని అన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాల ఊసే లేదని.. రైతుబంధుకు దిక్కే లేదని విమర్శించారు. వృద్ధులు పింఛన్లు, రైతులు, రైతు కూలీలు రైతు భరోసా కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. జాబ్ క్యాలెండర్‌లో ఉత్త క్యాలెండర్ తప్ప జాబ్‌లు కనిపించడం లేదని అన్నారు. ఇలా అన్ని వర్గాలను కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని అన్నారు. ఆరు గ్యారంటీలకు రేవంత్ సర్కార్ మంగళం పడిందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను కాంగ్రెస్ మోసం చేసిందని అన్నారు.

## జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడుతారని ప్రచారం

-మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ హయాంలో ఎల్ రమణ వంటి వారికి మంత్రి పదవి ఇవ్వాల్సిందని అభిప్రాయపడ్డారు. అలాంటి తప్పిదాల వల్లనే బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రాలేదని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన సంజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీకి దగ్గరయ్యారు. అభివృద్ధి పనుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపారు. సంజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీకి దగ్గరైనప్పటి నుంచి పార్టీ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉంటున్నట్టు తెలుస్తోంది. కొన్ని రోజుల క్రితం జరిగిన మున్సిపల్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తీరుపై జీవన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పటి నుంచో పార్టీలో ఉన్న తన వర్గానికి తక్కువ సీట్లు ఇచ్చి, సంజయ్ కుమార్ వర్గానికి ఎక్కువ టిక్కెట్లు కేటాయించారని ఆరోపించారు. ఈ క్రమంలో జీవన్ రెడ్డి త్వరలో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, బీఆర్ఎస్ పార్టీలో చేరుతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ ప్రచారం నేపథ్యంలో సంజయ్ కుమార్ పైవిధంగా స్పందించారు.

## ఎమ్మెల్యేలు, ఎంపీలు డ్రగ్స్ పరీక్షలు చేయించుకోవాలి

-మొదటిపేజీ తరువాయి

ఈ నేపథ్యంలో,కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి నేడు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. డ్రగ్స్ అనే మహమ్మారి మూలాలు ఎక్కువగా సినిమా పరిశ్రమలోనే కనిపిస్తున్నాయని ఆయన ఆరోపించారు. అందుకే సినిమాల విడుదలకు ముందే నటీనటులందరికీ డ్రగ్స్ టెస్టులు నిర్వహించాలని, అందులో క్లీన్‌గా ఉంటేనే వారి సినిమాలను థియేటర్లలోకి అనుమతించాలని సంచలన ప్రతిపాదన చేశారు. కేవలం సినీ రంగమే కాదు, ప్రజాప్రతినిధులు కూడా సమాజానికి ఆదర్శంగా ఉండాలని. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎమ్మెల్యేలు, ఎంపీలు అందరూ తప్పనిసరిగా డ్రగ్స్ పరీక్షలు చేయించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.డ్రగ్స్ టెస్ట్ చేయించుకోవడానికి నిరాకరించే ఏ ప్రజాప్రతినిధినైనా సరే అసెంబ్లీలోకి అడుగుపెట్టనివ్వకూడదని అన్నారు.

# ప్రతి పౌరుడికి అభివృద్ధిలో భాగస్వామ్యం

-మొదటిపేజీ తరువాయి

ప్రపంచానికే దిక్సూచిగా తెలంగాణ నిలుస్తోందని అన్నారు. ఏడాది కాలంలో సంక్షేమ ఫలితాలు అందరికీ అందేలా తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని గవర్నర్ తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రాన్ని కోర్, ప్యూర్, రేర్‌గా విభజించామని, హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించామని గవర్నర్ తెలిపారు. హిల్ట్ పాలసీ ద్వారా పరిశ్రమల భూముల బదలాయింపు చేపట్టామని గవర్నర్ తెలిపారు. ప్రజలకు రక్షణ, భద్రత కల్పించేందుకు నాలుగు కమిషనరేట్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మూసీనది ప్రక్షాళనకు ప్రణాళికలు రచిస్తున్నామని, తొలి దశలో హిమాయత్‌సాగర్ నుంచి గాంధీసరోవర్ వరకు అభివృద్ధి చేపడతామని ఆయన చెప్పారు. మూసీలో మురుగు నీరు చేరకుండా 39 ఆర్ఓబిలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఓఆర్ఆర్ మాదిరిగా రీజినల్ రింగ్ రోడ్ ఏర్పాటు చేయబోతున్నా మని గవర్నర్ తెలిపారు. పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలకు తరలించాలని నిర్ణయించామని గవర్నర్ తెలిపారు. ఆర్ఆర్ఆర్ చుట్టూ ఎమ్ఎస్ఎమ్ఈ పార్కులు ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. తెలంగాణను గ్లోబల్ హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా 5 లక్షల 72 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని గవర్నర్ పేర్కొన్నారు. ఆర్ఆర్ఆర్, ఓఆర్ఆర్‌కు అనుబంధంగా రేడియల్ రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. ఫ్యూచర్ సిటీ నుంచి బందర్ పోర్టు వరకు గ్రీన్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం చేపడతామని వివరించారు. బుల్లెట్ రైళ్లకు శంషాబాద్ కేంద్రంగా మారబోతోందన్నారు. వరంగల్, ఆదిలాబాద్‌లో కొత్త ఎయిర్‌పోర్టులు రాబోతున్నా యని గవర్నర్ వెల్లడించారు. ఇల్లులేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని గవర్నర్ తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా 4లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. రైతు భరోసా కింద 9 రోజుల్లో రూ.9వేల కోట్లు అందించామని చెప్పారు. ఎస్‌హెచ్‌జీలకు రూ.లక్ష కోట్ల రుణాలు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా స్కూల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. కొడంగల్ ప్రాంతం పారిశ్రామికవాడగా మారబోతోందని గవర్నర్ వెల్లడించారు. ఐటీ ఎగుమతులు రూ.3.13 లక్షల కోట్లకు చేరాయన్నారు. వ్యవసాయరంగ అభివృద్ధికి రేర్ నమూనా రూపొందించామని తెలిపారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక అమలుకు 99 రోజుల కార్యాచరణ రూపొందించి నట్లు తెలిపారు. ప్రజావాణికి వచ్చిన 64,697 పిటిషన్లలో 47,670 పరిష్కరించామని గవర్నర్ శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. ప్రతి పౌరుడు అభివృద్ధిలో భాగస్వామిగా ఉండేలా రాష్ట్ర బడ్జెట్ ఉంటుందనిశుక్లా అన్నారు. ప్రతి వర్గానికీ అభివృద్ధి ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. శ్రమించేతత్వం గల తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు. ప్రజా కేంద్రీకృత పాలన ప్రభుత్వ విధానం. విజన్-2047 ద్వారా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు రోడ్డు మ్యాప్ రూపొందించాం. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4.18లక్షలకు చేరింది. క్యూర్, ప్యూర్, రేర్ మోడల్ ద్వారా రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. పట్టణాభివృద్ధికి క్యూర్ మోడల్ అనుసరిస్తున్నాం. 2031 నాటికి పట్టణ జనాభా 53.8 శాతానికి చేరుతుందని అంచనా. జీహెచ్ఎంసీని ఇటీవలే 3 కార్పొరేషన్లుగా.. హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతాన్ని 4 కమిషనరేట్లుగా విభజించాం. హైడ్రా ద్వారా రూ.60వేల కోట్ల ప్రభుత్వ ఆస్తులను కాపాడాం.23వ బయో ఆసియా సదస్సు ద్వారా రూ.1700 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం. జీసీసీలలో 20 శాతం ఆతిథ్యం ఇస్తూ హైదరాబాద్ గ్లోబల్ టెక్ హబ్‌గా మారింది. ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణ కొనసాగుతోంది. ఐటీ ఎగుమతులు రూ.3.13 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఈ రంగం 9.39లక్షల ఉద్యోగాలు కల్పిస్తోందని అన్నారు. గతేడాది వానాకాలంలో రైతుభరోసా కింద రూ.8,744 కోట్లు ఇచ్చాం. పంట రుణమాఫీ కోసం రూ.20,616 కోట్లు ఖర్చు చేశాం. సాగునీటి రంగానికి కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. కొత్తగా 15.12లక్షల రేషన్ కార్డులు ఇచ్చాం. 3.38 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నాం.

# సమావేశాల్లో ఎమ్మెల్యేలు హాజరు కావాల్సిందే

-మొదటిపేజీ తరువాయి

ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలపై సమాధానం ఇచ్చేందుకు పూర్తి సమాచారం దగ్గర ఉంచుకోవాలన్నారు. ఏదో ఒక సాకుతో సభ్యులు సభకు గైర్హాజరు కావొద్దన్నారు. సీఎల్పీకి పలువురు ఎమ్మెల్యేలు హాజరు కాకపోవడంపై సీఎం సీరియస్ అయ్యారు. సీఎల్పీకి రాలేనంత బిజీగా ఉన్నారా అని ప్రశ్నించారు. మీడియాతో చిట్‌చాట్‌లు చేయవద్దన్నారు. ప్రజా ప్రభుత్వంలో మూడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నామని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ప్రాధాన్యం, భవిష్యత్ ప్రణాళికలకు సంబంధించి గవర్నర్ శివప్రతాప్ శుక్లా తన ప్రసంగంలో వివరించారని తెలిపారు. గవర్నర్ ప్రసంగం రాష్ట్ర ప్రభుత్వానికి రోడ్ మ్యాప్ లాంటిదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించాల్సిన సమయం అయిపోయిందని అన్నారు. ప్రభుత్వ భవిష్యత్ ప్రణాళికలు, ప్రజలకు ఏం చేయబోతున్నామనే విషయంపై దృష్టి సారించాలని సూచించారు. సభలో మాట్లాడే అంశాలపై ప్రభుత్వ విప్‌ల మధ్య సమన్వయం ఉండాలని ఆదేశించారు. సభలో చర్చ పక్కదారి పట్టకుండా, సభా సమయం వృథా కాకుండా సమర్థవంతంగా నడిపేలా చూడాలని దిశానిర్దేశర చేశారు. కేసీఆర్ హయాంలో.. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడటానికి తమకు సమయం ఇవ్వలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. సీఎల్పీ నేతగా ఉన్న మల్లు భట్టి విక్రమార్కకు, జానారెడ్డికి కూడా మైక్ ఇవ్వలేదని ఆగ్రహించారు. సెషన్ మొత్తం సస్పెండ్ చేసి ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు తనను సభకు రాకుండా చేశారని ధ్వజమెత్తారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో హాజరు విషయంలో ఎమ్మెల్యేలు నిర్లక్ష్యం వహించొద్దని హుకుం జారీ చేశారు. మహిళా శాసన సభ్యులు హాజరుతో పాటు చర్చల్లో పాల్గొనాలని మార్గనిర్దేశర చేశారు. సభా చర్చల్లో మహిళా సభ్యుల భాగస్వామ్యం అవసరమని తెలిపారు. ఇది మన ప్రభుత్వం.. ఇప్పుడు మనం వేసుకునే రోడ్ మ్యాప్‌నే వచ్చే ఎన్నికలకు అజెండా అవుతుందని అన్నారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యపై ఫోకస్ పెట్టాలని ఆదేశించారు. 99 రోజుల ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిందేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.అసెంబ్లీ కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర రాష్ట్రాల్లో పర్యటించి పలు సమస్యలు, ఆయా ప్రభుత్వ విధానాలను అధ్యయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశర చేశారు. రాజకీయాల్లో వ్యక్తిగత డ్యామేజీ ఉండదని.. అది వ్యవస్థ మొత్తాన్ని డ్యామేజ్ చేస్తోందని అన్నారు. వ్యవస్థను నిలబెట్టుకుంటేనే రాజకీయాల్లో మనుగడ ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ, ప్రభుత్వ పరమైన లైన్‌లోనే అందరూ స్పందించాలని సూచించారు.

# సమావేశాల నిర్వహణ పై హరీష్ అసంతృప్తి

-మొదటిపేజీ తరువాయి

ఈ నెల 30వ తేదీ వరకు సమావేశాలు నిర్వహిస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, వాస్తవానికి సభ నడిచేది వారం రోజులు కూడా ఉండదని హరీష్ రావు పేర్కొన్నారు. సమావేశాల మధ్యలో ఉగాది, రంజాన్, శ్రీరామనవమి వంటి పండుగలతో పాటు రెండు ఆదివారాలు వస్తున్నాయని, ఆ ఐదు సెలవు దినాలను మినహాయిస్తే చర్చకు చాలా తక్కువ సమయం మిగులుతుందని ఆయన గణాంకాలతో సహా వివరించారు. సమావేశాల అజెండాపై క్లారిటీ ఇస్తూ, మార్చి 17 , 18 తేదీలలో గవర్నర్ ప్రసంగంపై చర్చ జరుగుతుందని, ఆ తర్వాత మార్చి 20వ తేదీన ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతుందని ఆయన వెల్లడించారు. అయితే, బ్జడెట్ వంటి కీలక అంశంపై సమగ్రంగా చర్చించే అవకాశం లేకుండా ప్రభుత్వం షెడ్యూల్‌ను కుదించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పండుగ సెలవుల వల్ల తగ్గిన పనిదినాలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం మార్చి 29వ తేదీ ఆదివారం నాడు కూడా సభను నిర్వహించాలని భావిస్తోంది. దీనిపై స్పందించిన హరీష్ రావు, ఆదివారం నాడు సభ పెట్టినా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. తమకు కావాల్సింది కేవలం చర్చకు తగిన సమయం మాత్రమేనని, ప్రజల పక్షాన గళం వినిపించేందుకు తాము ఎప్పుడూ సిద్ధమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించి బ్జడెట్‌ను ఆమోదింపజేసుకోవాలని చూస్తోందని, దీనివల్ల ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతింటుందని ఆయన విమర్శించారు.

# జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడుతారని ప్రచారం

-మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ హయాంలో ఎల్ రమణ వంటి వారికి మంత్రి పదవి ఇవ్వాల్సిందని అభిప్రాయపడ్డారు. అలాంటి తప్పిదాల వల్లనే బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రాలేదని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన సంజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీకి దగ్గరయ్యారు. అభివృద్ధి పనుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపారు. సంజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీకి దగ్గరైనప్పటి నుంచి పార్టీ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉంటున్నట్టు తెలుస్తోంది. కొన్ని రోజుల క్రితం జరిగిన మున్సిపల్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తీరుపై జీవన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పటి నుంచో పార్టీలో ఉన్న తన వర్గానికి తక్కువ సీట్లు ఇచ్చి, సంజయ్ కుమార్ వర్గానికి ఎక్కువ టిక్కెట్లు కేటాయించారని ఆరోపించారు. ఈ క్రమంలో జీవన్ రెడ్డి త్వరలో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, బీఆర్ఎస్ పార్టీలో చేరుతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ ప్రచారం నేపథ్యంలో సంజయ్ కుమార్ పైవిధంగా స్పందించారు.

# కవి నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు

-మొదటిపేజీ తరువాయి

నందిని సిధారెడ్డి తెలంగాణ సాహిత్య అకాడమి తొలి చైర్మన్‌గా పనిచేశారు. తన కలం ద్వారా తెలంగాణ సంస్కృతి, ఆత్మ, జీవన విధానాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా తెలంగాణ సాహిత్యానికి అగ్రగామిగా నిలిచారు. ఆయన రచనలు కేవలం కవిత్వం మాత్రమే కాక, తెలంగాణ జీవితం, ప్రజల సమస్యలు, ఉద్యమం వంటి అంశాలను స్పష్టంగా ప్రతిబింబిస్తాయి. మెదక్ జిల్లా కేంద్రంగా 'మంజీరా రచయితల సంఘం' స్థాపించి, ఎందరో వర్ధమాన కవులను, రచయితలను ప్రోత్సహించారు. సాహిత్యానికి ప్రాంతీయతను అద్దడంలో ఆయనది ప్రత్యేక శైలి. ఈ సంఘం ద్వారా తెలుగు సాహిత్యంలో నూతనవాణి, విభిన్న అభివ్యక్తులు, సామాజిక చైతన్యానికి వేదికైంది. ఈ సంఘం తెలుగు సాహిత్యానికి కొత్త వన్నె తెచ్చి, యువ రచయితలకు ప్రేరణనిస్తూ, తెలంగాణ స్వరాష్ట్ర ఆకాంక్షను, ఆవశ్యకతను తన సృజనాత్మక రచనల ద్వారా చాటుతూ తెలంగాణ ఉద్యమానికి గొప్ప ఊపునిచ్చింది. ఈ అవార్డు తెచ్చిపెట్టిన 'అనిమేష' కవితా సంపుటి కేవలం అక్షరాల కూర్పు కాదు అది ఒక కాలానికి దర్పణం. ప్రపంచాన్ని వణికించిన కరోనా కాలంలోని సామాజిక పరిస్థితులు, మానవ సంబంధాలు, వలస కూలీల కష్టాలు, ఒంటరితనాన్ని ఈ సంపుటిలో కళ్లకు కట్టారు. 'అనిమేష'లో కరోనా సమయంలో ప్రపంచం ఎదుర్కొన్న సామాజిక, ఆర్థిక, మానవ సంబంధ సమస్యలను నందిని సిధారెడ్డి హృద్యంగా చిత్రీకరించారు. మానవ సంబంధాల విచ్ఛిన్నత, సమాజంలో ఒంటరితనం, ఆందోళన, సామాజిక కలతలను ప్రతిబింబింపజేసే నందిని సిధారెడ్డి కవిత్వం పాఠకులకు ప్రేరణగా నిలుస్తోంది. 'నాగేటి సాల్లళ్ల నా తెలంగాణ' వంటి పాటల ద్వారా తెలంగాణ పల్లె జీవనాన్ని, ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆయన పాటలు ప్రజలను ఉర్రూతలూగించడమే కాకుండా, స్వరాష్ట్ర ఆకాంక్షను బలోపేతం చేశాయి. తెలంగాణ స్వతంత్ర రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో నందిని సిధారెడ్డి పాటలు, కవిత్వం ద్వారా ప్రజలను ఆలోచింపజేశారు. ఆయన రచనలు రాష్ట్ర ఉద్యమానికి ఉత్సాహాన్ని నింపాయి. ప్రజల సమస్యలను కవిత్వం ద్వారా తెలియజేయడం, ఉద్యమ కవిగా ప్రజల అభిమానాన్ని పొందడం ఈ విధంగా తెలంగాణ ఉద్యమంలో నందిని సిధారెడ్డి కీలక పాత్ర పోషించారు. నందిని సిధారెడ్డి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందడం తెలంగాణ సాహిత్యానికి, సమాజానికి, సాంస్కృతికంగా గర్వకారణమని సాహితీ లోకం హర్షం వ్యక్తం చేస్తోంది. ఆయన కృషి, తెలుగు సాహిత్యానికి చేసిన విశిష్టమైన సేవలు గుర్తింపుగా నిలిచాయి. తెలంగాణ ఆత్మ, జీవితం, సంస్కృతిని ప్రపంచానికి చాటిన రచయితగా నందిని సిధారెడ్డి ప్రత్యేక స్థానాన్ని సంపాదించారని సాహితీ లోకం తెలిపింది. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత, భాషా సాహిత్యాల వికాసం కోసం ఏర్పాటు చేసిన తెలంగాణ సాహిత్య అకాడమీకి తొలి చైర్మన్‌గా నందిని సిధారెడ్డి సేవలు అందించారు. ప్రాచీన సాహిత్యం నుంచి ఆధునిక సాహిత్యం వరకు అనేక పుస్తకాలను ఆయన వెలుగులోకి తెచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి యేటా అందించే, అత్యున్నత 'కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు -2025 ' ఈసారి ప్రముఖ తెలంగాణ కవి, రచయిత, నందిని సిద్దారెడ్డి కి దక్కడం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నందిని సిద్దారెడ్డిని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కరోనా సందర్భంగా ప్రపంచం ఎదుర్కొన్న సంక్షోభాన్ని, ముఖ్యంగా మానవ సంబంధాల విచ్ఛిన్నతలను కవిత్వం ద్వారా హృద్యంగా చిత్రీకరించిన, దీర్ఘ కవితా సంపుటి ' అనిమేష'కు ఈ అవార్డు రావడం గొప్ప విషయమని అన్నారు.

# గ్రామ పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర అత్యంత కీలకం

- పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయం
- నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ : అనుముల భాస్కర్
- పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు - సానిటేషన్ సామగ్రి పంపిణీ - సన్మానం

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 16, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్, పాలకవర్గం ఆధ్వర్యంలో సోమవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల ఆక్షన్ ప్లాన్ షెడ్యూల్ ప్రకారం గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, యూనిఫామ్‌లు, సానిటేషన్ సామాగ్రి అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనుముల భాస్కర్ మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రతకు పారిశుద్ధ్య కార్మికులు ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. గ్రామాన్ని శుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచడంలో వారు చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. వారి ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని భావించి ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన యూనిఫామ్‌లు,సానిటేషన్ సామాగ్రి అందజేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధిలో పారిశుద్ధ్య సిబ్బంది సేవలను ఎల్లప్పుడూ గౌరవిస్తామని, వారికి అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు గ్రామపంచాయతీ కట్టుబడి



ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుసుంబ మహేందర్, మాజీ వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్య, వార్డు సభ్యులు కొంకటి కమలాకర్, కుడుకల శ్రీకాంత్, ఉమ్మారెడ్డి అనిల్ రెడ్డి, ఆవుల మల్లయ్య, ఎర్ర నాగరాజు, కొనుకటి చంద్రయ్య, ఎర్ర శ్రీకాంత్, కొనుకటి మహేందర్, కడుదుల నాగరాజు, పంచాయతీ కార్యదర్శి స్వప్న, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నీలోజి పల్లి గ్రామ సర్పంచ్ ప్రత్యేక చొరవతో అభివృద్ధిలో మరో ముందడుగు

- నీలోజిపల్లిలో వీధులకు రోడ్డు నెంబర్లు నూతన బోర్డుల ఏర్పాటు

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 16, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని నీలోజిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ నేతృత్వంలో, పాలకవర్గ సభ్యుల సమక్షంలో గ్రామంలోని వీధులకు రోడ్డు నెంబర్లను ఏర్పాటు చేసి నూతన బోర్డులను ఏర్పాటు చేశారు. గ్రామంలోని వీధులన్నీ దాదాపు ఒకే విధంగా ఉండటంతో గ్రామానికి కొత్తగా వచ్చే వ్యక్తులు అడ్రస్ గుర్తించడంలో అయోమయానికి గురవుతున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఈ చర్యలు చేపట్టారు. సర్పంచ్ ప్రత్యేక చొరవతో గ్రామంలోని ప్రతి వీధికి రోడ్డు నెంబర్లు కేటాయించి బోర్డులను ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు గత కొన్నాళ్లుగా ఎదురుచూస్తున్న సమస్యకు పరిష్కారం లభించింది. ఈ సందర్భంగా సర్పంచ్ అనుముల భాస్కర్ మాట్లాడుతూ, గ్రామానికి వచ్చే ప్రజలు, అధికారులు, అత్యవసర సేవల సిబ్బంది వీధులను సులభంగా గుర్తించేందుకు ఈ బోర్డులు ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం అవసరమైన మౌళిక సదుపాయాలను అందించడంలో పాలక వర్గం ఎప్పుడూ ముందుంటుందని, భవిష్యత్తులో కూడా గ్రామాన్ని మరింత



అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుసుంబ మహేందర్,మాజీ వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్య, వార్డు సభ్యులు కొంకటి కమలాకర్, కుడుకల శ్రీకాంత్, ఉమ్మారెడ్డి అనిల్ రెడ్డి, ఆవుల మల్లయ్య, ఎర్ర నాగరాజు, కొనుకటి చంద్రయ్య,ఎర్ర శ్రీకాంత్, కొనుకటి మహేందర్, కడుదుల నాగరాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వప్న, తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రకృతి రత్న ఉత్తమ అవార్డు గ్రహీత బడుగుల సైదులుకు అభినందనలు

- విద్యార్థి దశ నుండే పచ్చదనం పర్యావరణం అవగాహన ఏర్పడాలి
- ఎంఈఓ సలీం షరీఫ్ కోదాడ

కోదాడ, మార్చి 16 (తెలంగాణ పత్రిక):

పట్టణంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులు బడుగుల సైదులుకు ప్రకృతి రత్న ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కోదాడ మండల విద్యాధికారి ఎండి. సలీం షరీఫ్ పాల్గొని మాట్లాడినారు, పాఠశాలలో కిచెన్ గార్డెన్ బడి తోట పచ్చదనం పర్యావరణం మొక్కల పెంపకం కోసం విద్యార్థుల, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయులు బడుగుల సైదులు కు ఆదివారం నాడు కోదాడ పట్టణంలో సిరి ఫౌండేషన్, జి హెచ్ ఆర్ హీరో హోండా షో రూమ్ కోదాడ సంయుక్త సారథ్యంలో జరిగిన ఉగాది పురస్కారాలు కార్యక్రమంలో ప్రకృతి రత్న ఉత్తమ ఉపాధ్యాయుడిగా స్థానిక ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి చేతులమీదుగా అవార్డు పురస్కారం తీసుకోవడం పట్ల హర్షం అభినందనలు తెలియజేసినారు. పురస్కారం అవార్డులు చేసిన కృషికి గుర్తింపు, గౌరవం తోపాటు బాధ్యతను మరింతగా పెంచుతాయని



తెలిపినారు. పాఠశాలలో పచ్చదనం , మొక్కల పెంపకం కోసం యూత్ అండ్ ఎకో క్లబ్, యంగ్ ఎర్త్ లీడర్స్ కమిటీ ఉపాధ్యాయులు వి. శ్రీనివాసరావు ఎం .చిన్నప్ప, విద్యార్థులను అభినందించారు.పనిచేస్తున్నఈ సందర్భాన్ని స్ఫూర్తి దాయకంగా తీసుకొని ప్రభుత్వ బడులలో కిచెన్ గార్డెన్, పెరటి తోటల ఏర్పాటు అభివృద్ధికి విద్యార్థులు ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు డి. మార్కండేయ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# తహసీల్దార్ కి వినతి పత్రం అందజేత





కథలాపూర్ తెలంగాణ పత్రిక మార్చ్ 16

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఈరోజు కథలాపూర్ మండల కేంద్రంలో మండల శాఖ అధ్యక్షులు మల్యాల మారుతి ఆధ్వర్యంలో రాస్తారోకో చేసి అనంతరం స్థానిక తహసీల్దార్ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం నాయకులు కోడిపెల్లి గోపాల్ రెడ్డి,మల్యాల మారుతి,యువమోర్చ నాయకులు కాసోజీ ప్రతాప్ మాట్లాడుతూ నెరవేర్చని రాష్ట్ర ప్రభుత్వం హామీలను తక్షణమే అమలు చేయాలని అలాగే మండల రెవెన్యూ అధికారిగా మీ పరిధిలోని ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బిజెపి తరఫున వినతి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇవ్వడం జరిగింది కానీ వాటిలో ఏ ఒక్క హామీ కూడా ఇప్పటివరకు పూర్తిగా అమలు కాలేదు ముఖ్యంగా యువతకు జాబ్ క్యాలెండర్,నిరుద్యోగ భృతి,వృద్ధప్తా,వితంతు మరియు దివ్యాంగులకు పెన్షన్లు పేదలకు గృహ నిర్మాణ పథకం,రైతులకు రైతు భరోసా,భూ సమస్యల పరిష్కారం వంటి అనేక హామీలు ఇప్పటివరకు అమలుకు కావడం లేదు. ప్రభుత్వం మీద నమ్మకం పెట్టుకొని ఓటు వేసిన ప్రజలు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రైతులు తీవ్రమైన ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారు ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా సమయానికి అందకపోవడంతో రైతులు పెట్టుబడుల కోసం అప్పు పై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం 6ఆరు గ్యారెంటీల పేరుతో ఆరు అబద్ధాలు 66 మోసాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికి ఏధీ కూడా సక్రమంగా నిర్వహించలేక ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకతతో కొట్టు మిట్టాడుతోంది రైతుకు రాని భరోసా,కలగానే సొంతం గృహం,చీకట్లు నింపిన గృహ జ్యోతి,అందని చేయూత,కానరాని యువ వికాసం,మహాలక్ష్మి అని మోసం వీటన్నింటిని చెప్పుకొని మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన ఈ కాంగ్రెస్ సర్కార్ ఇప్పటికైనా వీటన్నింటిని అమలు చేయాలి లేని పక్షంలో భారతీయ జనతా పార్టీ కథలాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులని ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బద్రి సత్యం, బండ అంజయ్య, పిడుగు ఆనంద్ రెడ్డి, సర్పంచులు మల్యాల రమేష్, చిందం సుధాకర్ కంటే రాజం,నరెడ్ల రవి, కథలాపూర్ మహేష్, గడ్డం జీవన్ రెడ్డి, జిల్లా సత్యం, వొడ్డెటి సునీల్, ఉపసర్పంచ్ బొమ్మ మధు, పచ్చిమట్ల గంగాధర్, దారావత్ రాంసింగ్, లోక్య నాయక్, కల్లెడ ప్రసాద్, మల్యాల శ్రీకర్, వినయ్, లింగమూర్తి, భూమయ్య, నరేష్, రాజేష్, సాయిరెడ్డి, మహేష్, నరేందర్, నరేష్, రాజేష్, సాయి, రాజేష్, ప్రశాంత్, నవీన్, ప్రవీణ్, సత్యం, అంజయ్య, నగేష్ పాల్గొన్నారు.

## నేడు సబ్ స్టేషన్ లో మరమ్మత్తుల కారణంగా విద్యుత్ నిలిపివేయబడును



భిక్కనూరు మార్చి 16 (తెలంగాణ పత్రిక మండల ప్రతినిధి)

భిక్కనూరు మండల కేంద్రంలో విద్యుత్ సబ్ స్టేషన్ లో విద్యుత్ మరమ్మత్తుల పనుల దృశ్య నేడు తేదీ.17-03-2026 రోజు ఉదయం 9;00 గంటల నుండి మధ్యాహ్నం 2;00 గంటల వరకు విద్యుత్తులేన్ల మరమ్మత్తుల పనులు ప్రభావిత ప్రాంతాలు భిక్కనూరు పట్టణంలో ముందస్తుగా ఈమరమ్మత్తుల పనుల వల్లవిద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగ దారులు ఈ అసౌకర్యానికి గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని, పనులు నిర్ణీత సమయం కంటే ముందే పూర్తయితే విద్యుత్ సరఫరాను త్వరగానే పునరుద్ధరించడం జరుగుతుంది అని ఏఈ సంకీర్తన్ తెలిపారు,ఈ క్రమంలో లైన్మెన్ శ్రీకాంతం మాణిక్యం, గంధం వేణు,జేఎల్ఎం శ్రీకాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్యాలయ రికార్డుల తనిఖీకి దరఖాస్తు

భిక్కనూరు మార్చి 16 ( తెలంగాణ పత్రిక మండల ప్రతినిధి )



భిక్కనూరు మండలంలోని కాచపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉన్న రికార్డులను సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం తనిఖీ చేయడానికి దరఖాస్తు సమర్పించినట్లు, అఖిల భారతీయ ప్రజాసేవ సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ కామా రెడ్డి జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు మోతే లావణ్య తెలిపారు. సోమవారం కాచాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి సమాచార హక్కు చట్టం 2005 సెక్షన్ 2(జె)(1) ప్రకారం రికార్డుల తనిఖీ నిమిత్తం గ్రామపంచాయతీ కార్యదర్శి మౌనికకు దరఖాస్తు ఇచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామపంచాయతీల నుండి పార్లమెంట్ వరకు ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఉన్న రికార్డులను సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రతి పౌరుడు దరఖాస్తు చేసుకుని తనిఖీ చేసే హక్కు కలిగి ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలలో జరుగుతున్న అవినీతిని వెలికితీయడంలో సమాచార హక్కు చట్టం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆమె అన్నారు. ఇదిలా ఉండగా గ్రామపంచాయతీ కార్యదర్శి మౌనిక మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 నిబంధనల ప్రకారం రికార్డుల తనిఖీకి సంబంధించిన తేదీ మరియు సమయాన్ని త్వరలో తెలియజేస్తామని తెలిపారు.

## బీటీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



ఇల్లంతకుంట, మార్చి 16 తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని బస్టాండ్ పక్కన బీటీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బెంద్రం తిరుపతి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలు దప్పికతో ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో చల్లని, సురక్షిత మినరల్ త్రాగునీరు అందించేందుకు ప్రతి సంవత్సరం బస్టాండ్ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గత 16 సంవత్సరాలుగా ప్రజలకు జలప్రసాదం అందించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు సేవ చేయడమే బీటీఆర్ ఫౌండేషన్ లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో బొల్లారం ప్రసన్న కుమార్, ఎర్రోజు సంతోష్, సాదుల నిరంజన్, బోయిని రంజిత్, బొల్లం రాంసాగర్, గజ్జల శ్రీనివాస్, అంతగిరి అనిల్, ఎల్లేంకి శ్రీనివాస్, పయ్యావుల నవీన్, సందవేని శేఖర్, కట్నపెల్లి రవీందర్ రెడ్డి, భూమల్ల ప్రశాంత్, అంతగిరి సురేష్, బొంగొని శ్రీనివాస్, జక్కుల శ్రీనివాస్, గుంటి మహేష్, అకుల రాజమల్లు, రమణారెడ్డి, వేణు, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో అక్షరాభ్యాసం, అన్నప్రాసన

కథలాపూర్ తెలంగాణ పత్రిక మార్చి 16



కథలాపూర్ మండలం పోతారం గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమం సోమవారం నిర్వహిం చడం జరిగింది. ముందుగా సరస్వతి దేవి పూజలు చేసి అనంతరం చిన్నారులతో అఆలు దిద్దించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ స్రవంతి, సర్పంచ్ స్వప్న జలంధర్, ఏఎంసి వైస్ చైర్మన్ శిరీష, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేష్,పీఎం శ్రీ ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యాయులు శ్రీనివాస్, అంగన్వాడి టీచర్లు స్వరూప, పద్మ మహిళలు పాల్గొన్నారు.

## భక్తుల ఇంటి వద్దకే భద్రాద్రి శ్రీ సీతా రామ కల్యాణ తలంబ్రాలు

**– పోస్టర్ ఆవిష్కరణ చేసిన నర్సంపేట డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి**



నర్సంపేట మార్చి 16 తెలంగాణ పత్రిక

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నర్సంపేట డిపో లాజిస్టిక్స్ ద్వార భక్తుల ఇంటి వద్దకే భద్రాచలం శ్రీ సీతారాముల కల్యాణ తలంబ్రాలు బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించినట్లు డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మి తెలిపారు. భక్తులు తలంబ్రాల బుకింగ్ కొరకు నర్సంపేట బస్టాండు యందు గల కార్గో, లాజిస్టిక్స్ ఆఫీస్ యందు కార్గో డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సతీష్ మరియు కార్గో ఏజెంట్స్ వద్ద 151/-రూపాయలు చెల్లించి బుకింగ్ రషీదు పొందగలరని తెలిపారు. సీతా రాముల కళ్యాణం అనంతరం ఇంటి వద్దకు కార్గో ఏజెంట్స్ ద్వారా తలంబ్రాలు పంపిణి చేస్తారని తెలిపారు. భద్రాచలం లోని శ్రీ సీతా రాముల కళ్యానానికి వెళ్లలేని భక్తులు ఇట్టి సదావకాశాన్ని వినియోగించుకుని శ్రీ రాముని ఆశీస్సులు పొందగలరని తెలిపారు. తలంబ్రాల బుకింగ్ 9704644543, 9989038476 కొరకు నంబర్లను సప్రదించగలరు.

## జగిత్యాల 8వ వార్డులో విచిత్ర డ్రైనేజ్ నిర్మాణం

జగిత్యాల, మార్చి 16, (తెలంగాణ పత్రిక ):



జగిత్యాల పట్టణంలోని మున్సిపల్ 8వ వార్డు గోత్రాల కాలనీలో డ్రైనేజ్ నిర్మాణంలో అధికారుల నిర్లక్ష్యం బయటపడింది. సాధారణంగా కల్వర్టు కిందుగా వెళ్లాల్సిన డ్రైనేజ్ లైన్‌ను పైభాగంలో ఏర్పాటు చేయడంతో మురుగు నీరు కల్వర్టుపై నుంచి ప్రవహించే పరిస్థితి ఏర్పడింది. దీంతో వర్షాలు పడినప్పుడు లేదా చెత్త అడ్డం పడినప్పుడు మురుగు నీరు నిలిచిపోతూ కాలనీలో దుర్వాసన వ్యాపిస్తోంది. మురుగు నీరు సరిగా వెళ్లకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు తెలిపారు. చెత్త, మట్టి అడ్డం పడినప్పుడు నీరు నిలిచి చుట్టుపక్కల ప్రాంతాల్లో మురికి పేరుకుపోతుందని, దీని వల్ల దోమలు పెరిగి అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు ఆరోగ్య సమస్యలతో బాధపడే పరిస్థితి ఉందని కాలనీ వాసులు చెబుతున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమీపంలోనే ఉన్న ఈ కాలనీలో ఇలాంటి నిర్లక్ష్య పనులు జరగడం ఆశ్చర్యకరమని ప్రజలు విమర్శి స్తున్నారు. పనులు చేపట్టే సమయంలో సరైన ప్రణాళిక లేకుండా డ్రైనేజ్ వ్యవస్థను నిర్మించడంతో ఈ సమస్య తలెత్తిందని వారు అంటున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్య పై వెంటనే స్పందించి డ్రైనేజ్ వ్యవస్థను సరిచేసి కాలనీవాసులకు ఉపశమనం కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

**– కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**– గాలికుంటు నివారణ టీకాల ప్రచార రథం ప్రారంభం**



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 16, తెలంగాణ పత్రిక

పశువుల సంరక్షణకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. జాతీయ పశు వ్యాధుల నివారణ కార్యక్రమాన్ని పశు వైద్య, పశు సంవర్ధక శాఖ, జిల్లా అధికార యంత్రాంగం ఆద్వర్యంలో సిద్ధం చేసిన ప్రచార రథాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. పశువుల పెంపకందారులు తమ జీవాల ఆరోగ్య సంరక్షణ, ఆర్థికంగా నష్ట పోకూడదనే ఉద్దేశంతో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ప్రభుత్వం ఉచితంగా వేయిస్తుందని పేర్కొన్నారు. పెంపకం దారులు ముందస్తుగా టీకాలు వేయించి.. రోగాల బారి నుంచి జీవాలను రక్షించాలని సూచించారు. అన్ని పాడి పశువులు, నాలుగు నెలల వయసు దాటిన ఎద్దులు, దూడలకు పశువుల పెంపకందారులు, రైతులు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని, పశు వైద్య డాక్టర్లు, సిబ్బంది 26 టీమ్ లుగా ఏర్పడి వచ్చే నెల ఏప్రిల్ 9వ తేదీ వరకు టీకాలు వేస్తారని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ప్రచార రథంతో అవగాహన కల్పించాల ని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశు వైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చలో అసెంబ్లీ ముట్టడికి యత్నించిన మాజీ సర్పంచులు





**– మానవహక్కుల కమిషనర్ ఆఫీస్ వద్ద అరెస్ట్ అబిడ్స్ పోలీస్ స్టేషన్ కు తరలింపు......**

**– అప్పులు తెచ్చి గ్రామ అభివృద్ధి చేశాం....**

**– అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం....**

**– మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి...**

**– లేనియెడల అసెంబ్లీని ముట్టడిస్తాం.....**

**– మాజీ సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర కార్యదర్శి మేడెం విద్యాసాగర్....**

నర్సంపేట మార్చి 16 తెలంగాణ పత్రిక

కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావలసిన గ్రామ పంచాయతీలకు పెండింగ్ బిల్లులు వచ్చిన గాని మాజీ సర్పంచులకు ఇవ్వడం లేదు మాజీ సర్పంచులకు నూతన సర్పంచులకు పంచాయితీ సెక్రటరీలకు పైసల పంచాయితీ పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమములో భాగంగా అసెంబ్లీ వైపు వెళుతుండగా ఇంటలిజెన్స్ పోలీస్ సహకారముతో నయవంచక రేవంత్ ప్రభుత్వం మానవ హక్కుల కమిషనర్ హెచ్ ఆర్ సి హైదరాబాద్ ఆఫిస్ వద్ద పోలీస్ లు అరెస్ట్ చేసి అబిడ్స్ పోలీస్ స్టేషనికి తరలించడం జరిగింది. తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర కార్యదర్శి మోడెం విద్యాసాగర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 2019 –24 వరకు గ్రామాలలో అభివృద్ధి పనులు చేసిన మాజీ సర్పంచులు పెండింగ్ బిల్లులు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 29 నెలలు అవుతున్న బిల్లులు చెల్లించడం లేదని అసెంబ్లీ సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యే లు మా సమస్యను పరిష్కరించాలి అని పెద్ద ఎత్తున బిల్లులు రావలసిన సర్పంచులు అసెంబ్లీ వద్దకు చేరుకొని నిరసన తెలపడం జరిగింది.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి గ్రామపంచాయతీలకు మాజీ సర్పంచులకు కేంద్ర ప్రభుత్వం నుంచి 15 ఆర్థిక సంఘం బిల్లులు చెల్లించడం లేదు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎస్ ఎఫ్ సి నుండి పనిచేసిన బిల్లులు ఎస్ డి ఎఫ్ స్టేట్ డెవలప్మెంట్ ఫండ్ నుంచి పనిచేసిన బిల్లులు కొంతమంది సర్పంచుల మన ఊరు మనబడి బిల్లులు సంవత్సరాల తరబడి ప్రభుత్వం చెల్లిస్తాదని ఎదురు చూసి ఎదురుచూసిన ప్రయోజనం లేకుండా పోయింది వడ్డీలకు అప్పులు తేవడం వల్ల విపరీతంగా వడ్డీలు పెరిగిపోయినాయి ఆర్థికంగా మాజీ సర్పంచుల కుటుంబాలు చిన్నాభిన్నభావుతున్నది కొంతమంది సర్పంచులు ఆత్మహత్యలు కూడా చేస్తున్నారు కొంతమంది సర్పంచులు చాలా ఆర్థిక ఇబ్బందులతో కుషించిపోతున్నారు కావున రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంచాయతీరాజ్ మంత్రి సీతక్క మాజీ సర్పంచుల పెండింగ్ చెల్లించే విధంగా చర్యలు చేపట్టి మాజీ సర్పంచుల సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలి లేనియెడల పెద్ద ఎత్తున వివిధ రూపాలలో మా నిరసన తెలుపుతాము తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్ రెడ్డి ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య కార్యదర్శి కేశబోయిన మల్లయ్య, రాష్ట్ర నాయకులు బొడ్డు నరసింహ యాదవ్ మంగ నరసింహులు రజిత సుధాకర్ అనసూయ మల్లారెడ్డి వివిధ జిల్లాల నుండి వచ్చిన సర్పంచులు పాల్గొన్నారు.

## రసాయనాల వినియోగంతో భూములు దెబ్బ తినడంతో పాటు పంటలు దిగుబడి తగ్గుతుంది

**– సహాయ వ్యవసాయ సంచాలకులు దామోదర్ రెడ్డి....**

నర్సంపేట /దుగ్గొండి/ మార్చి 16 తెలంగాణ పత్రిక



దుగ్గొండి మండల రైతు వేదికలో రైతులకు ఆత్మ వారి సౌజన్యం తో వ్యవసాయ శాఖ దుగ్గొండి రైతు వేదిక నందు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికీ ముఖ్య అతిధిగా హాజరైన సహాయ వ్యవసాయ సంచాలకులు నర్సంపేట దామోదర రెడ్డి మాట్లాడుతూ సహజ వ్యవసాయం తో భూసారం పెరుగుతుందని, అధిక దిగుబడి సాదించవచ్చని తెలిపారు. రసాయనాల వినియోగం తో భూములు దెబ్బతినడం తో పాటు పంటల దిగుబడి తగ్గుతుందని,నాణ్యత లోపిస్తుందని వివరించారు. రైతులు సహజ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని కోరారు. వ్యవసాయ సీనియర్ శాస్త్రవేత్త వరంగల్ డాక్టర్ రాములు వరి, మొక్కజొన్న పంటలలో నత్రజని భాస్వరం ఎరువుల వినియోగం తగ్గించాలని పంట క్షేత్రాలలో సేంద్రీయ కర్బనం పెంచాలని దాని వలన అధిక దిగుబడులు సాదించవచ్చని తెలియజేయడం జరిగింది. దానితో పాటుగా పకృతి వ్యవసాయ చెప్పటాలని సూచించారు. అదే విధమగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో చేపడుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ, పిఎంకిసన్ మిసింగ్ ఫార్మర్ ఇన్ఫర్మేషన్, పంటల నమోదు ఎప్పటికప్పుడు స్థానిక విస్తరణ అధికారులతో అందుబాటులో ఉండి రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసుకోవాలని వివరించారు. ఇఫ్కో మేనేజర్ విశాల్ మాట్లాడుతూ నానో యూరియా నానో డీ ఏ పి నానో జింక్ లని పంట సాగు చేసే సమయంలో ఏ విధంగా వాడాలి దాని వలన కలిగే ప్రయోజనాలను రైతులకి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖలో ఉన్నటు వంటి సబ్సిడీలు పథకాలను వివరించడం జరిగింది కూరగాయలకి పండ్లతోటలకి ఆయిల్ పామ్ సాగు తోటలకి ఉన్నటువంటి పథకాలను వివరించడం జరిగింది. అదేవిధంగా రైతులు డ్రిప్పు పద్ధతిలో పండించినట్లయితే అధిక ఆదాయం ఉంటుందని చెప్పడం జరిగింది. అదేవిధంగా ఈ కార్యక్రమంలో వరంగల్ శాస్త్రవేత్త రాములు, వ్యవసాయ సహాయ సంచాలకులు దామోదర్ రెడ్డి, అగ్రికల్చర్ ఆఫీసర్ శ్యామ్, ఉద్యాన శాఖ అధికారిని జ్యోతి, విస్తీర్ణ అధికారిని త్రివేణి వ్యవసాయ విస్తీర్ణ నాధికారులు త్రివేణి, రాజేష్ , హనుమంతు విజయ్ దుగ్గొండి మండలం నుంచి పలు రైతులు పాల్గొన్నారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి ఎస్సై మల్లేష్





మునగాల, మార్చి 16(తెలంగాణ పత్రిక):

జిల్లా ఎస్పీ శ్రీ కె నరసింహ ఐపిఎస్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి సూచనల మేరకు కోదాడ డిఎస్పి శ్రీనివాస రెడ్డి అధ్వర్యంలో షి టీమ్ సిబ్బంది సోమవారం మునగాల మండల పరిధిలో గల ఆకుపాముల మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ సంక్షేమ పాఠశాల (బాలురు) లో అవగాహన షీ టీం అవగాహన సదస్సు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి షి టీమ్ ఎస్సై మల్లేష్ మాట్లాడుతూ. విద్యార్థులకు పలు విషయాల పై అవగాహన కల్పించారు. ప్రధానంగా ప్రస్తుతం సమాజంలో ఉన్న పరిస్థితుల గురించి, బెట్టింగ్ యాప్ లు, ఆన్లైన్ గేమింగ్ యాప్‌ల మాయలో పడి తమ భవిష్యత్తు ను పాడు చేసుకోవద్దని సూచించడం జరిగింది. లోన్ యాప్‌ల ఉచ్చులో పడి తమ ప్రాణాలు తీసుకోవద్దని కోరినారు. యువత గంజాయి మత్తులో పడి, దానికి బానిస అయి తమ ప్రాణాలను సైతం కోల్పోతున్నారని తెలియజేశారు. మేసేజ్ ల రూపంలో గాని, అసభ్యకరమైన పదజాలంతో దూషించడం గానీ, ఫోన్ లు చేసి గాని, మహిళల ఆత్మ గౌరవానికి ఇబ్బంది కలిగించే ఎటువంటి చర్యలకు పాల్పడిన కఠినంగా శిక్షించబడతారని హెచ్చరించడం జరిగింది. షి టీమ్ గురించి, సైబర్ నేరాల గురించి, షి టీమ్ ను సంప్రదించడం ఎలా అనే విషయం గురించి, అత్యవసర సమయాల్లో చేయవలసిన 100 డయల్ గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శోభా రాణి, షి టీమ్ మహిళా హెడ్ కానిస్టేబుల్ కవిత, సాయి జ్యోతి, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకం ద్వారా రహదారి నిర్మాణం

**– ప్రారంభించిన కొత్తగూడ సర్పంచ్ మల్లెల భాగ్యమ్మ**

పెద్ద గూడూరు/ కొత్తగూడ/ గంగారం:– మార్చి 16. (తెలంగాణ పత్రిక ప్రతినిధి):



మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడ మండలంలోని మైలారం చెరువు వైపు వెళ్లే రైతులకు, ప్రజలకు ఇక రహదారి కష్టాలు తీరనున్నాయి. నర్సంపేట ప్రధాన రహదారి నుండి మైలారం చెరువు వరకు కిలోమీటర్ మేర ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రోడ్డు పనులను, సర్పంచ్ మల్లెల భాగ్యమ్మ సోమవారం రోజున ఘనంగా ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. వ్యవసాయ పనుల నిమిత్తం మైలారం చెరువు వైపు వెళ్లే రైతులకు ఈ రోడ్డు ఉపయోగపడుతుందని, ఉపాధి హామీ కూలీలకు పని కల్పించడంతో పాటు గ్రామాభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తామని తెలిపారు. పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులకు, కూలీలకు సూచించారు. రోడ్డు పనులను ప్రారంభించడం పట్ల స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి సుమన్ రెడ్డి, వార్డు సభ్యుడు దేవులపల్లి రాజు, గ్రామ పెద్దలు గుమ్మడి సమ్మయ్య, మల్లెల బాబు, మల్లె లక్ష్మణ్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ కంగాల రాజు, గ్రామస్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య





**- అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి**

పెద్దపల్లి,ప్రతినిధి మార్చి 16 ( తెలంగాణ పత్రిక )

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత నిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి గంగయ్యఅన్నారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి గంగయ్యతో పాటు పాలనాధికారి బి. ప్రకాష్ కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. సుల్తానాబాద్ పట్టణం చెందిన గెల్లు కేతమ్మ వృధాప్య పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ డీఆర్డిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ డివిజన్ అధికారి గంగయ్య తెలిపారు. అంతర్గం గ్రామానికి చెందిన కొంకటి స్వరూప గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల యూనిఫాం కుట్టించే టెండర్ ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా విద్యా శాఖ అధికారికి రాస్తూ పరిశీలించాలని తెలిపారు. ఎలిగేడు మండలం శివపల్లి గ్రామానికి చెందిన తాండ్ర సుమన్ గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా ఎలాంటి పన్ను లు చెల్లించకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్న బ్రింద ఫంక్షన్ హాల్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేయగా జిల్లా పంచాయతీ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారి గంగయ్య తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ కరపత్రాల ఆవిష్కరణ



**- అఖిల భారత రైతు కూలి సంఘం జాతీయ జనరల్ కౌన్సిల్ ను జయప్రదం చేయండి**

**- మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సిద్ధబోయిన జీవన్**

పెద్ద గూడూరు/ కొత్తగూడ/ గంగారం:- మార్చి 16. (తెలంగాణ పత్రిక ప్రతినిధి):

మహబూబాబాద్ జిల్లా, ఫాఖాల కొత్త గూడ మండల కేంద్రంలోని కామ్రేడ్ పాలడుగు కృష్ణ స్మారక భవనంలో సోమవారం రోజున కరపత్రాలు ఆవిష్కరించారు. అఖిల భారత రైతు కూలి సంఘం (ఏఐకేఎంఎస్) జాతీయ జనరల్ కౌన్సిల్ ను జయప్రదం చేయాలని, 2026 ఏప్రిల్ 4,5 తేదిల్లో గుంటూరు లో కామ్రేడ్ మాదాల నారాయణ స్వామి హాల్ (వైన్ మర్చంట్స్ అసోసియేషన్ భవనం)లో జరిగే ఏఐకేఎంఎస్ జాతీయ జనరల్ కౌన్సిల్ ను జయ ప్రదం చేయాలని, అఖిల భారత రైతు కూలి సంఘం ( ఏఐకేఎంఎస్) మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్ద బోయిన జీవన్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ జనరల్ కౌన్సిల్ లో దేశ వ్యాప్తంగా వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభం - పరిస్థితులు పై చర్చించి, భవిష్యత్ కార్యాచరణను రూపొందించు కోవలసిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. దేశంలో రైతాంగం, రైతులు, కూలీలు, పీడిత ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యల పై, రైతాంగ పంటలకు గిట్టుబాటు ధరలకై ఏఐకేఎంఎస్ నిరంతరం ఉద్యమిస్తుందని కామ్రేడ్ జీవన్ అన్నారు. బడా భూర్జువా- బడా భూస్వామ్య వర్గాల ప్రభుత్వా లు ఎన్ని మారిన పేద ప్రజలు కూడు, గూడు, గుడ్డ, భూమి కరవై అల్లాడుతున్నారన్నారు. భూమి, భుక్తి, విముక్తి కోసం నాటి సంతాలులు, ముండాలు దగ్గర నుండి తేబాగా , తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం, నగ్జల్ బరి, శ్రీకాకుళ, గోదావరి లోయ ప్రతిఘటన పోరాటాలు, దండకారణ్య పోరాటాలు రాజ్యహింసను , అణచి వేతను తట్టుకుని మళ్లీ మళ్లీ తలెత్తుతూనే ఉన్నాయన్నారు. అర్ధ వలస - అర్ధ భూస్వామ్య వ్యవస్థ రద్దుకై, దున్నేవానికే భుమికై, వ్యవసాయక విప్లవ సాధనకై రైతు - కూలీలు, పీడిత ప్రజానీకం ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం ఎల్ ) న్యూడెమోక్రసీ పార్టీ, వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు కామ్రేడ్ రామచంద్రు, సాంబ రాజు, రాజమల్లు, లక్ష్మయ్య, మహేందర్, సాంబయ్య, కిశోర్, రాజు, కొమరయ్య, వెంకన్న, లచ్చన్న, మల్లయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పక్కాగా అమలు చేయాలి





**- లక్ష్యం ప్రకారం ముందుకు వెళ్లాలి**

**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- ప్రజా పాలనప్రగతి ప్రణాళికపై సమీక్ష**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 16, తెలంగాణ పత్రిక

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 6వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు 99 రోజుల పాటు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక

పై సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, మండల అధికారులతో కలెక్టర్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా పాలనప్రగతి ప్రణాళిక లో భాగంగా జిల్లా అధికారి తమకు ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల కు అనుగుణంగా పథకాలు అమలు చేయాలని, లక్ష్యం ప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించారు. మహిళా సంఘాల భవనాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని, ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. ఈ మేరకు ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. తమ పరిధిలోని అన్ని అంశాల పై యాక్షన్ ప్లాన్ అమలు చేసి విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. సమావేశంలో ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

## నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి పాలనలోనే మైనార్టీల అభివృద్ధి సాధ్యం





**- మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మిరామానంద్..**

నర్సంపేట మార్చి 16 తెలంగాణ పత్రిక

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నర్సంపేట పట్టణంలోని మాదన్నపేట రోడ్డు శివారులో గల ఈద్గా నందు జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించిన మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ , వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా, మున్సిపల్ కౌన్సిలర్లు..ఈ సందర్భంగా చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ వారు మాట్లాడుతూ..శాసనసభ్యులు దొంతిమాధవరెడ్డి సహకారంతో ఈద్గా మైదానంలో రంజాన్ పండుగ ప్రార్థనల కోసం సుమారు 50 లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్డు సీసీ ప్లాట్‌ఫాం నిర్మించడం జరిగిందని అన్నారు..సీసీ ప్లాట్‌ఫాం నిర్మించడం ద్వారా మురికి లేదా గడ్డి వంటి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రార్థనలు ప్రశాంతంగా నిర్వహించుకోవచ్చునీ.. భక్తులకు చాలా సౌకర్యవంతంగా ఉంటుంది అని అన్నారు..అదేవిధంగా నీటి వసతి, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తామని పరిసరాలు సుందరీకరణ చేస్తాం అని అన్నారు.. ఈద్గా నందు మిగిలి ఉన్న అభివృద్ధి పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు..ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీరామోజు రోజా రాణి, సలోవుద్దీన్ అయుబ్ ఖాన్, ముత్తినేని వెంకన్న, భూక్య మాతృ రాథోడ్, ఏవూరి శ్రీనివాస్ రెడ్డి, పున్నం నరసింహారెడ్డి, మస్జిద్ అధ్యక్షులు మసూద్ అలీ బేగ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవోజు సదానందం,లాక్కార్స్ రమేష్, పాషా, తదితరులు పాల్గొన్నారు..

## ప్రజావాణికి 142 దరఖాస్తుల రాక

**- అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 16, తెలంగాణ పత్రిక

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, 142 దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.రెవెన్యూ శాఖకు 56, డీఆర్డీఓకు 20, జిల్లా పంచాయతీ కార్యాలయం 14, గృహ నిర్మాణ శాఖకు 13, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ 7, నీటి పారుదల శాఖ, మున్సిపల్ కమిషనర్ కు మూడు చొప్పున, జిల్లా పౌర సరఫరాల శాఖ, జిల్లా విద్యాధికారి, ఉపాధి కల్పన అధికారి, జిల్లా వైద్యాధికారి, మైనింగ్ శాఖ అధికారి, ఎక్సైజ్ అధికారి, సెస్ ఎండీకి రెండు చొప్పున, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, ముఖ్య ప్రణాళిక అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ, అటవీ శాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ, జిల్లా సంక్షేమ శాఖ, వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర ఆలయం, ఈఈ ఆర్ అండ్ బీ, లీడ్ బ్యాంక్ మేనేజర్, మున్సిపల్ కమిషనర్ వేములవాడ, సబ్ రిజిస్టర్ ఆఫ్ సిరిసిల్ల, ఎస్పీ కార్యాలయం కు ఒకటి చొప్పున వచ్చాయి.వాటిని సంబంధిత కార్యాలయాల కు పంపించారు. ప్రజావాణిలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు ఆయా శాఖల తదితరులు పాల్గొన్నారు.

## అధిక ధరలను నియంత్రించాలి దామరచర్ల కేంద్రంగా సిపిఐ నిరసన..

**- పెట్టుబడిదారీ వర్గానికి కొమ్ము కాస్తున్న కేంద్ర ప్రభుత్వం పోలేపల్లి ఉదయ్ కుమార్**



మిర్యాలగూడ ప్రతినిధి//మార్చి 16:(తెలంగాణ పత్రిక):-

కేంద్ర పాలకవర్గం గత 13 సంవత్సరాల నుండి పెట్టుబడి వర్గాన్ని పెంచి పోషిస్తుందని నిరంతరం ప్రజలపై అధిక ధరలను పెంచి వారం మోపుతు న్నారని సిపిఐ దామరచర్ల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్ ఆరోపించారు. సోమవారం రాష్ట్ర సిపిఐ పార్టీ పిలుపుమేరకు దామరచర్ల కేంద్రంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెంచిన గ్యాస్ నిత్యవసరాల ధరలను తగ్గించి సామాన్యు లకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని దామరచర్ల సిపి పార్టీ పక్షాన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ దామరచర్ల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాసి ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి అధిక ధరలను పెంచేసి కేంద్ర పాలకవర్గం మొత్తం పెట్టిబడిదారి వర్గంను పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా ధరలను నియంత్రించకపోతే పెద్ద ఎత్తున జన సమీకరణ చేసి దేశవ్యాప్త ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శి ధనావత్ శాంత, సీనియర్ నాయకులు జమ్ముల కోటయ్య, గజ్జల లక్ష్మీనరసింహారెడ్డి, భాగం శేషయ్య, శుద్ధ బోయిన రాములు, వెంకన్న, వినయ్, యశ్వంతు, రమేష్, నరసింహ, సాంబ, శివాజీ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## నర్మాల గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన తహసిల్దార్

గంభీరావుపేట తెలంగాణ పత్రిక మార్చి 16



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల గురుకుల పాఠశాలను తాహసిల్దార్ మారుతిరెడ్డి కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ చేశారు అనంతరం తాహసిల్దార్ మారుతీ రెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న సందర్భంగా విద్యార్థులు మెరుగైన ఫలితాల కోసం కృషిచేసి మంచి ఫలితాలు సాధించాలని మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తాహసిల్దార్ తెలిపారు ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ కార్యాలయం అధికారులు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

## అంగన్వాడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

– సిఐటియు డిమాండ్







తెలంగాణ పత్రిక దమ్మపేట మార్చి 16

కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్వాడి ఉద్యోగులకు వేతనాలు పెంచుతామని ఎన్నికల మేనిఫెస్టోలో పెడితే అది నమ్మి ఓట్లు వేస్తే పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలని అడిగితే ఈ ప్రభుత్వానికి నేరంగా కనబడుతుందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ అన్నారు. అంగన్వాడీ ఉద్యోగుల హైదరాబాద్ ధర్నాకు వెళుతున్న అంగన్వాడి రాష్ట్ర నాయకత్వాన్ని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అక్రమ అరెస్టులు ఖండిస్తూ సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి న తర్వాత అంగన్వాడి ఉద్యోగుల ఏ ఒక్క సమస్య పరిష్కారానికి చొరవ చూపలేదని, ఇస్తున్నటువంటి కొద్దిపాటి వేతనాలు కూడా నెలలు తరబడి పెండింగ్లో ఉంటున్నాయని పని భారం మాత్రం విపరీతంగా పెంచి అంగన్వాడీలను మానసికంగా వేధిస్తున్నారని అన్నారు. సమస్యల పరిష్కారానికి పై అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళటానికి ఆందోళన నిర్వహిస్తుంటే మహిళలు అని చూడకుండా అర్ధరాత్రి ఇండ్ల మీద పడి వేటాడి భయభ్రాంతులకు లోన్ అయ్యేటట్లు అరెస్టుల పర్వం కొనసాగిస్తుందని, గత పాలకులకు పట్టిన గతే కాంగ్రెస్కు పడుతుందని అన్నారు. అనంతరం సిఐటియు మండల కన్వీనర్ మురహరి రఘు మాట్లాడుతూ అరెస్టు చేసిన అంగన్వాడి రాష్ట్ర నాయకులను తక్షణమే విడుదల చేయాలని ఎన్నికల వాగ్దానం మేరకు 18 వేల రూపాయల వేతనం పెంచాలని పెండింగ్ టిఏడిఏలు సెంటర్ హద్దులు గ్రాడ్యుటి డబ్బులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామకృష్ణ అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు సూరమ్మ జ్యోతి రాజ్యలక్ష్మి శాంతి అజిత కవిత వెంకటేశ్వరమ్మ జయ జానకి తదితరులు పాల్గొన్నారు.

## 6 ఏళ్లుగా ప్రతి సోమవారం ప్రజావాణిలో దివ్యాంగుడి ఆవేదన

–ఉద్యోగం ఇవ్వకపోతే కలెక్టర్ కార్యాలయం ముందు ఆత్మహత్య చేస్తానని హెచ్చరిక



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 16, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని మార్కండేయ నగర్ కాలనీకి చెందిన దివ్యాంగుడు ఓదెల నరేష్ తన ఆవేదనను వ్యక్తం చేశాడు. గత 6 సంవత్సరాలుగా ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి హాజరై ఉద్యోగం కల్పించాలని అధికారులను వేడుకుంటున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. పుట్టుకతోనే దివ్యాంగుడైన నరేష్ డిగ్రీ,ఐటీఐ వరకు చదువుకున్నాడు. అయినప్పటికీ పోటీ పరీక్షలు రాసినా ఉద్యోగం దక్కలేదని తెలిపారు. గత పది సంవత్సరాలుగా అద్దె ఇంట్లో కుటుంబంతో జీవనం సాగిస్తున్నానని, ప్రస్తుతం తన కుటుంబ పరిస్థితి చాలా దయనీయంగా మారిందని కన్నీరు మున్నీరయ్యాడు. తన సమస్యను ప్రత్యేక కేసుగా పరిగణించి ఉద్యోగం కల్పించాలని కోరుతూ గతంలో జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వందలాది దరఖాస్తులు ఇచ్చినా ఎవరూ పట్టించుకోలేదని ఆరోపించాడు. కొంతమంది ప్రజాప్రతినిధులు ఇచ్చిన లెటర్ప్యాడ్లు కూడా అధికారుల నిర్లక్ష్యానికి గురై చెత్తకుండీలో పడేశారని ఆవేదన వ్యక్తం చేశాడు.సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ప్లకార్డులతో నిరసన తెలుపుతూ తన గోడును వెల్లడించాడు. ప్రజావాణికి వచ్చే అధికారులు కేవలం దరఖాస్తులు తీసుకోవడమే తప్ప తనకు శాశ్వత ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించాడు.ప్రస్తుత ప్రభుత్వం అయినా తన పరిస్థితిని గుర్తించి మానవత్వంతో స్పందించాలని ఆశిస్తున్నానని తెలిపారు. ఈ నెలలోగా తనకు ఉద్యోగం కల్పించకపోతే కలెక్టర్ కార్యాలయం ముందు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం తప్ప మరో మార్గం కనిపించడం లేదని నరేష్ హెచ్చరించాడు. దివ్యాంగుడైన తన సమస్యను ప్రత్యేక కేసుగా పరిగణించి అధికారులు తక్షణమే న్యాయం చేయాలని ఓదెల నరేష్ విజ్ఞప్తి చేశాడు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాల పై ఆరా తీసిన సిపిఎం బృందం





– ఆరోగ్యశ్రీ వర్తింపజేయాలని డిమాండ్.

మిర్యాలగూడ ప్రతినిధి//మార్చి 16:(తెలంగాణ పత్రిక):– .

మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ 200 పడకల ఆసుపత్రిని సోమవారం నాడు సిపిఎం బృందం సందర్శించి రోగులకు అందిస్తున్న సౌకర్యాలపై సిపిఎం బృందం ఆరా తీసింది. ఆసుపత్రిలో పళ్ళు వార్డులలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి వారికి అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఆసుపత్రి సూపరింటెంట్ ను కలిసి రోగులకు అందిస్తున్న విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణ చుట్టు పక్కల ప్రాంతాలకు తగినట్టుగా ఆసుపత్రిలో సౌకర్యాలు అరకొరగా అందుతున్నాయన్నారు. సోమవారం నుండి జరిగే రాష్ట్ర బడ్జెట్లో వైద్యానికి అధిక నిధులను కేటాయించి స్థానిక ఆసుపత్రిలోని సౌకర్యాలను మెరుగుపరచాలని కోరారు. త్వరలో ఆసుపత్రిని ట్రామా సెంటర్ గా మారడం హర్షనేయమే కానీ దానికి కార్యాచరణ కావాలన్నారు. గత సంవత్సర కాలం నుండి రాష్ట్ర ప్రభుత్వం ఆస్పత్రి లో వచ్చే రోగులకు ఆరోగ్యశ్రీని అందించకపోవడం చాలా బాధాకరం అన్నారు. ఏరియా ఆసుపత్రికి వచ్చే ప్రజలు పేద వర్గాలకు చెందిన వారిని, వారు ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోలేని స్థితిలో ఉన్నారని అలాంటి వారికి ప్రభుత్వం వైద్య సహాయం అందించాలని కోరారు. ఆసుపత్రి నందు గత కొంతకాలంగా దంత వైద్యులు లేరని మంజూరైన స్పెషలిస్ట్ డాక్టర్లను వెంటనే పంపించాలని కోరారు. ఆసుపత్రిలో స్కానింగ్, సిటీ స్కానింగ్ గాని లేవని న్యూరో సర్జన్ పోస్టు మంజూరైన వైద్యులను బదిలీ చేయలేదని వారు తెలిపారు. ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ విధానం పనిచేస్తున్న వారందరిని రెగ్యులర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆయనతో పాటు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వేరుపల్లి వెంకటేశ్వర్లు, మంగారెడ్డి, గౌతంరెడ్డి, జగదీష్, చంద్ర లు ఉన్నారు.

## నిరుపేద కుటుంబానికి చేయూత పిఆర్ ముదిరాజ్ సేవా సమితి

నర్సంపేట మార్చి 16 తెలంగాణ పత్రిక

దుగ్గొండి మండలం తిమ్మంపేట గ్రామం ఇటీవల కాలంలో బండారి లక్ష్మి ముదిరాజ్ అనారోగ్య రీత్యా మరణించిన నేపథ్యంలో పిఆర్ ముదిరాజ్ సేవా సమితి బాధ్యులు తాళ్ళ రవీందర్, సింగారపు రామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామ కుల పెద్దలు దండు నర్సయ్య,దండు రవి,దండు రాజు సమక్షంలో బాధిత కుటుంబానికి 10,000 పదివేల రూపాయలు ఒక క్వింటల్ బియ్యం అందజేశారు. అనంతరం సంఘం నేతలు మరియు వార్డు మెంబరు మేక సుమలత రాజు, గంగరబోయిన నిరంజన్ లు సంయుక్తంగా మాట్లాడుతూ, కూలి పనికి వెళ్లి వచ్చి కట్టుకున్న భార్య లక్ష్మి తన కళ్ళ ముందు చనిపోతుంటే చూసి నిస్సహాయ స్థితిలో ఉన్న కొమురయ్య పరిస్థితి, కుటుంబ దయనీయ ఆర్థిక స్థితిని అర్థం చేసుకొని, పిఆర్ ముదిరాజ్ సేవా సమితి పెద్దలు సిద్దిపేట మాజీ కౌన్సిలర్ పెసరు రాజన్న గ్రామ వాస్తవ్యులు కె ఎస్ అర్ అభ్యాస్ విద్యాసంస్థ చైర్మన్ నరహరి రాజేందర్ రెడ్డి. కుల ప్రముఖులు, దాతల సహకారంతో బాధిత కుటుంబానికి సాయం చేయడం చాలా గర్వకారణమని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం వల్ల ముదిరాజ్ జాతి ఐక్యతకు దోహదపడతాయని, ముదిరాజు బిడ్డలు దానం చేసే స్థాయికి ఎదగాలని కోరారు. దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు,ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. పిఆర్ ముదిరాజ్ సేవా సమితి సేవకులు సింగారపు రామకృష్ణ, తాళ్ళ రవీందర్, ముద్రబోయిన రమేష్ కుల పెద్దలు దండు రవి మత్స్య సహకార సంఘం



అధ్యక్షులు దండు నర్సయ్య, కార్యదర్శి దండు రాజు, డైరెక్టర్ మేక అనిల్; వార్డు మెంబరు మేక సుమలత రాజు; గౌరవ సలహాదారులు గాలిబు సంపత్, గంగరబోయిన నిరంజన్ వాడకట్టు కుల బంధువులు కుమ్మరికుంట్ల రాంబాబు, భూమ సంపత్, పొన్నం, కోమ్మయ్య, దండు రాజేందర్ , రాములు కుమ్మరికుంట్ల చంటి యువజన నాయకులు గంగరబోయిన నవీన్, దండు ఉదయ్ కిరణ్, సందీప్, దండు రమేష్, సాంబయ్య, దండు బాలయ్య, దండు చిరంజీవి ముదిరాజ్; బండారి లక్ష్మి కుటుంబ సభ్యులు కొమురయ్య, కూతురు ఎలా స్వాతి, సంధ్యరాణి, సిరి చందన, రిక్విత మణికుమార్ తదితర గ్రామ కుల బంధువులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా (రైతు బంధు) వెంటనే విడుదల చేయలి

తెలంగాణ పత్రిక దమ్మపేట మార్చి 16




అఖిలభారత ఐక్య రైతు సంఘం ఏఐయుకేఎస్ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి వెంటనే రైతు భరోసా ఇవ్వాలని,మొక్కజొన్న, ఎర్రజొన్న అన్ని రకాల పంటలకు ఎంఎస్పి మద్దతు అమలు చేయాలని పోడు సాగు చేసుకుంటున్న అందరికీ బట్టలు ఇవ్వాలని పోడు సాగుదారులపై అధికారుల దాడులను నిలిపివేయాలని తదితర పంటలకు కనీస మద్దతు ధరల అమలుచేయాలనీ తదితర డిమాండ్స్ తో అఖిలభారత ఐక్యత సంఘం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఎమ్మార్వో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డిమాండ్ తో కూడిన వినతి పత్రం ఇవ్వడం జరిగింది . ఈ సందర్భంగా ఏఐయుకేఎస్ మండల కార్యదర్శి పండూరి వీరబాబు సిపిఎంఎల్ మాస్ లైన్ మండల మండల కమిటీ సభ్యులు ఊకె అప్పారావు కాక వెంకటేష్ మాట్లాడుతూ దేశంలోనూ రాష్ట్రంలోనూ రైతాంగం బ్రతుకులు రోజురోజుకూ కష్టతరంగా మారుతున్నాయి. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు సకాలంలో స్పందించడంలో విఫలమవుతున్నాయని దీనివల్ల రైతులు మరింత ఆర్థిక ఇబ్బందుల్లో పడుతున్నారు. ఈ నేపథ్యంలో రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడానికి అఖిల భారత ఐక్య రైతు సంఘం తరపున రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతాంగానికి రైతు భరోసా పెంచి ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి అవసరమైన సమయంలో రైతు భరోసా అందక పంటల పెట్టుబడుల కు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఈనాటి వరకు కూడా ఇవ్వకపోగా మాటల గారడీతో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రులు మోసం చేస్తున్నారని అన్నారు ప్రభుత్వం వెంటనే ఇప్పటికైనా రైతు భరోసా (రైతు బంధు) విడుదల చేయలని అన్నారు. వర్షాకాలం సీజన్ ముగిసి యాసంగి(రభి) సీజన్ ప్రారంభమై అర్ధకాలం గడిచింది. రైతులు భూములు చదును చేయడం, విత్తనాలు కొనుగోలు చేయడం, ఎరువులు వేసుకోవడం వంటి పనుల కోసం పెద్ద మొత్తంలో పెట్టుబడులు అప్పులు చేసి పెడుతున్నారని అయితే ఈ సీజన్కు సంబంధించిన రైతు భరోసా (రైతు బంధు) ఇప్పటివరకు విడుదల కాలేదని దీనివల్ల రైతులు అప్పుల పాలై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారఅన్నారు కాబట్టి ప్రతి సీజన్కు సంబంధించిన రైతు భరోసాను సకాలంలో విడుదల చేయడం అత్యంత అవసరం. అందువల్ల ప్రస్తుత యాసంగి సీజన్కు సంబంధించిన రైతు భరోసా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే ముందు మూడు సాగుదారులందరికి పట్టాలు ఇస్తామని చెప్పి ఈనాటి వరకు కూడా పట్టాలు ఇవ్వకపోగా మూడు సాగుదారులపై అటవీ అధికారుల చేత దాడులు చేయిస్తూ వారిపై కేసులు పెడుతూ జైలు పంపిస్తాం దుర్మార్గమైన చర్యలని వారన్నారు

### పంటలకు కనీస మద్దతు ధరల అమలు గురించి:

కేంద్ర ప్రభుత్వం రైతుల పంటలకు కనీస మద్దతు ధరలు (ఎం ఎస్ పి) కల్పిస్తామని హామీ ఇచ్చినప్పటికీ అవి ప్రస్తుత మార్కెట్లో అమలు కావడం లేదు. కేంద్ర ధరల నిర్ణయ కమిషన్ కేవలం ధరలను ప్రకటించడం వరకు మాత్రమే పరిమితమై ఉంది. అమలుకు తగిన యంత్రాంగం లేకపోవడం వల్ల రైతులు భారీ నష్టాలను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం మొక్కజొన్నకు రూ. 2400/– కనీస మద్దతు ధర ప్రకటించినప్పటికీ మార్కెట్లో రూ. 1600/– నుండి రూ. 1700/– వరకు మాత్రమే ధర లభిస్తోంది. దీనివల్ల రైతులు దాదాపు రూ. 1000/– వరకు నష్టపోతున్నారు. అలాగే ఎర్రజొన్నలకు కూడా ప్రకటించిన కనీస మద్దతు ధర అమలు కావడం లేదు. మార్కెట్లో రైతులకు రూ. 3300/– వరకు కూడా సరైన ధర లభించడం లేదు. దీనివల్ల రైతాంగం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది. అందువల్ల ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న, ఎర్రజొన్న పంటలను కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకోవాలని మరియు వ్యవసాయ మార్కెట్లలో వెంటనే మార్క్ ఫెడ్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరుతున్నాము. కాబట్టి పై పేర్కొన్న సమస్యలను పరిగణనలోకి తీసుకుని రైతులకు తక్షణమే న్యాయం జరిగే విధంగా తగిన చర్యలు తీసుకోవలసిందిగా మేము అఖిల భారత ఐక్య రైతు సంఘం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డిమాండ్ చేస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో తామరాముడు కుంజ కాంతారావు తెల్లం నాగేష్ రుక్కోల అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జనగణన కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా నిర్వహించాలి






**- భవిష్యత్తు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రణాళికకు గణాంకాలు కీలకం**
**- జనగణన 2027 హౌస్ లిస్టింగ్ పై సంబంధిత అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ**

పెద్దపల్లి, ప్రతినిధి మార్చి16 ( తెలంగాణ పత్రిక )

జనగణన 2027 కార్యక్రమాన్ని మన పెద్దపల్లి జిల్లాలో కట్టుదిట్టంగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తెలిపారు. సోమవారం జనగణన 2027 కార్యక్రమం నిర్వహణలో భాగంగా తొలిదశలో నిర్వహించనున్న హౌస్ లిస్టింగ్ ,హౌసింగ్ సెన్సెస్ సంబంధించి సంబంధిత అధికారులకు సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ. జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీ మాట్లాడుతూ, జనగణన తొలి దశ పై శిక్షణ కార్యక్రమం మార్చి 16 నుండి 18 వరకు మూడు రోజుల పాటు నిర్వహించబడుతుందని అన్నారు.జనగణన కార్యక్రమం దేశ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రజల నివాస గృహాల వివరాలు, మౌలిక సదుపాయాల స్థితి, కుటుంబాల వివరాలు తదితర అంశాలను ఈ దశలో నమోదు చేయడం జరుగుతుందని వివరించారు. జనగణన ప్రక్రియ పారదర్శకంగా, ఖచ్చితంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి అధికారి మీద ఉందన్నారు. శిక్షణలో భాగంగా డేటా సేకరణ విధానం, డిజిటల్ పరికరాల వినియోగం, ఫీల్డ్ స్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కేటాయించిన అధికారులు పూర్తి స్థాయిలో శిక్షణ పొంది అవగాహన పొందాలని తెలిపారు.జిల్లాలో జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికకు అవసరమైన ఖచ్చితమైన గణాంకాలు సిద్ధమవుతాయని పేర్కొన్నారు.ఈ శిక్షణ కార్యక్రమంలో సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మండల/ మున్సిపల్/ మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 6 ఏళ్లుగా ప్రతి సోమవారం ప్రజావాణిలో దివ్యాంగుడి ఆవేదన

**-ఉద్యోగం ఇవ్వకపోతే కలెక్టర్ కార్యాలయం ముందు ఆత్మహత్య చేస్తానని హెచ్చరిక్న**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 16, తెలంగాణ పత్రిక



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని మార్కండేయ నగర్ కాలనీకి చెందిన దివ్యాంగుడు ఓదెల నరేష్ తన ఆవేదనను వ్యక్తం చేశాడు. గత 6 సంవత్సరాలుగా ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి హాజరై ఉద్యోగం కల్పించాలని అధికారులను వేడుకుంటున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. పుట్టుకతోనే దివ్యాంగుడైన నరేష్ డిగ్రీ, ఐటీఐ వరకు చదువుకున్నాడు. అయినప్పటికీ పోటీ పరీక్షలు రాసినా ఉద్యోగం దక్కలేదని తెలిపారు. గత పది సంవత్సరాలుగా అద్దె ఇంట్లో కుటుంబంతో జీవనం సాగిస్తున్నానని, ప్రస్తుతం తన కుటుంబ పరిస్థితి చాలా దయనీయంగా మారిందని కన్నీరు మున్నీరయ్యాడు.తన సమస్యను ప్రత్యేక కేసుగా పరిగణించి ఉద్యోగం కల్పించాలని కోరుతూ గతంలో జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వందలాది దరఖాస్తులు ఇచ్చినా ఎవరూ పట్టించుకోలేదని ఆరోపించాడు. కొంతమంది ప్రజాప్రతినిధులు ఇచ్చిన లెటర్‌ప్యాడ్‌లు కూడా అధికారుల నిర్లక్ష్యానికి గురై చెత్తకుండీలో పడేశారని ఆవేదన వ్యక్తం చేశాడు.సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ప్లకార్డులతో నిరసన తెలుపుతూ తన గోడును వెల్లడించాడు. ప్రజావాణికి వచ్చే అధికారులు కేవలం దరఖాస్తులు తీసుకోవడమే తప్ప తనకు శాశ్వత ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించాడు.ప్రస్తుత ప్రభుత్వం అయినా తన పరిస్థితిని గుర్తించి మానవత్వంతో స్పందించాలని ఆశిస్తున్నానని తెలిపారు. ఈ నెలలోగా తనకు ఉద్యోగం కల్పించకపోతే కలెక్టర్ కార్యాలయం ముందు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం తప్ప మరో మార్గం కనిపించడం లేదని నరేష్ హెచ్చరించాడు.దివ్యాంగుడైన తన సమస్యను ప్రత్యేక కేసుగా పరిగణించి అధికారులు తక్షణమే న్యాయం చేయాలని ఓదెల నరేష్ విజ్ఞప్తి చేశాడు.

# నాలుగు లేబర్ కోడ్లపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి

**-- ఐఎఫ్‌టీయూ**
**-కార్పొరేట్ల సంపద పెంపుకోసం కార్మికుల హక్కులను హరించొద్దు -- నాయకుల ఆగ్రహం**

కొత్తగూడెం ఆర్‌సి, మార్చి 16 (తెలంగాణ పత్రిక):




దేశంలో ఏప్రిల్ 1 నుండి నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం కార్మిక వ్యతిరేక చర్య అని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జాతీయ ఉపాధ్యక్షులు సాదినేని వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జే. సీతారామయ్య విమర్శించారు. కార్పొరేట్ సంస్థల సంపద పెంపుకోసం కోట్లాది కార్మికుల గొంతుకు ఉరితాడు బిగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయబోమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ పిలుపు మేరకు సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు తోడేటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సాదినేని వెంకటేశ్వరరావు, జే. సీతారామయ్య పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక సమ్మెలు, పోరాటాలు, త్యాగాల ద్వారా సాధించిన 29 కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని తెలిపారు. ఈ కోడ్లు కార్మిక వర్గానికి ఏ మాత్రం ప్రయోజనం కలిగించవని, కార్మికుల హక్కులు, రక్షణలను పూర్తిగా నిర్వీర్యం చేసేలా రూపొందించారని అన్నారు. లేబర్ కోడ్ల ద్వారా కార్మిక సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కును బలహీనపరచడం, కనీస వేతనాల అమలును తగ్గించడం, సమ్మెలపై ఆంక్షలు విధించడం, రోజుకు ఎనిమిది గంటల పనిని 14 గంటల వరకు పెంచే అవకాశం కల్పించడం వంటి అంశాలు ఉన్నాయని విమర్శించారు. అలాగే మహిళలతో అర్ధరాత్రి పనులు చేయించే పరిస్థితులు కూడా కల్పిస్తున్నారని తెలిపారు. వలస పాలన కాలం నాటి కార్మిక చట్టాలను రద్దు చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేస్తోందని, కానీ రద్దు చేసిన 29 చట్టాల్లో కేవలం నాలుగే 1947కు ముందు చేసినవని, మిగతావన్నీ స్వతంత్ర భారత పార్లమెంటులో చర్చించి ఆమోదించినవేనని గుర్తు చేశారు. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు ఇప్పటికే నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయబోమని ప్రకటించి అసెంబ్లీల్లో తీర్మానాలు చేసినట్లు తెలిపారు. అదే విధంగా తెలంగాణ ప్రభుత్వం కూడా వెంటనే అసెంబ్లీలో తీర్మానం చేసి రాష్ట్రంలో లేబర్ కోడ్లను అమలు చేయబోమని ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండి రాసుద్దీన్, డి. ప్రసాద్, గౌని నాగేశ్వరరావు, తోడేటి నాగేశ్వరరావు, ఎన్. సంజీవ్, కొండపల్లి శ్రీనివాస్, ఎర్రం శ్రీను, యాసరపు వెంకన్న, రావురి ఉపేందర్‌రావు, నరసింహారావు, మంకేన వెంకటేశ్వర్లు, వెంకటమ్మ, శరత్, రాధ, శ్రీనివాస్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక ప్రజలకు ఎంతో మేలు సంస్కృతిక సారధి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి శ్రీకాంత్

నడిగూడెం మార్చ్ 16 (తెలంగాణ పత్రిక)



నడిగూడెం మండలం మండల కేంద్రంలో సోమవారం నాడు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పై రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల కార్యాచరణ ప్రవేశపెట్టింది ఈ కార్యక్రమం పది వారాలపాటు గ్రామ అవార్డు సభలు నిర్వహించి పరిసరాల పరిశుభ్రత గంజాయి డ్రగ్స్ నిర్మూలన ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కరించుకోవడం కోసం వారానికి ప్రత్యేక విభాగం కార్యక్రమాలపై వారోత్సవాలను ప్రభుత్వం చేపట్టింది సాంస్కృతిక సారధి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి శ్రీకాంత్. టీం లీడర్ పల్లెల లక్ష్మణ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లెల రాము తెలియజేశారు ఈ కార్యక్రమంలో 99 రోజులో సర్పంచి నుంచి ఎమ్మెల్యే ఎంపీ వరకు ప్రజా ప్రతినిధులు అందరిని భాగస్వామ్యం మండల పట్టణ నియోజకవర్గ కేంద్రాలలో వివిధ శాఖల అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాళ్లు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి ప్రభుత్వ అమలు కార్యక్రమాలను వివరించనుంది ఈ కార్యక్రమంలో సంస్కృతిక సారధి జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి శ్రీకాంత్. గ్రామ సర్పంచ్ దున్న శ్రీనివాసులు. గ్రామ కార్యదర్శి . జిల్లా టీం లీడర్ పల్లెల లక్ష్మణ్. జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లెల రాము. గంట బిక్షపతి. గడ్డం ఉదయ్. పాక ఉపేందర్. మాజీ శంకర్. మద్దిరాల మంజుల. కుందమల్ల నాగలక్ష్మి. ములకలపల్లి మల్లమ్మ. సిరిపంగి రాధ.గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు...

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల పోస్టర్ ఆవిష్కరణ

**-ఐడీఓసీ లో ఆవిష్కరించిన కలెక్టర్**



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 16, తెలంగాణ పత్రిక

అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సులతో రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆవిష్కరించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీ ఎస్ సీ, బీ కాం, బీఏ తదితర కోర్సుల వివరాలతో సిద్ధం చేసిన పోస్టర్లను కలెక్టర్ గరిమ అగ్రవాల్, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులతో కలిసి విడుదల చేశారు. త్వరలో దోస్త్ వెబ్ సైట్ ద్వారా అడ్మిషన్లు పొందాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోర్సులు, సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు.కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిరిసిల్ల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి శంకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లావణ్య, అడ్మిషన్ ఇంచార్జి జి శ్రీధర్ రావు, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ ప్రసాద్, ఐ క్యూ ఏ సీ కోఆర్డినేటర్ డాక్టర్ శోభారాణి, డాక్టర్ కృష్ణ ప్రసాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఫిజిక్స్, డాక్టర్ కే శారద అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు, డాక్టర్ కే వై కరుణ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ కెమిస్ట్రీ, ఆఫీస్ ఇంచార్జి గోపికృష్ణ, రమేష్ కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామంలో లైబ్రరీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి

**-మండల సిపిఎం పార్టీ డిమాండ్**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 16, తెలంగాణ పత్రిక



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్పల్లి,మండలం తో పాటు అన్ని మండల స్థాయి గ్రామాల్లో గ్రామ పంచాయతీల అను సంధానంగా లైబ్రరీ వ్యవస్థను ఏర్పాటు చేయడం వల్ల ఆ గ్రామంలో ఉన్న విద్యార్థులకు పుస్తకాల పాఠ్యంవల్ల విజ్ఞానం పెంపొందించుకోవడానికి ఈ లైబ్రరీ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడు తుంది. ప్రభుత్వంలో పాలకుల నిర్లక్ష్యం వల్ల గ్రామాలలో మద్యం బెల్ట్ షాపులకిచ్చినంత ప్రాధాన్యత, విద్యార్థులకు విజ్ఞానం అందించే లైబ్రరీ వ్యవస్థను మెరుగుపరిచి నిర్మించకపోవడం 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో గ్రామాల్లో నిర్మించకపోవడం చాలా దురదృష్టకరం. పాలకులు చిత్తశుద్ధితో వ్యవరించి గ్రామాలలో ఇప్పటికైనా మేల్కొని విద్యార్థులకు పుస్తకాల ద్వారా చక్కటి విజ్ఞాన బోధన అందించే లైబ్రరీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని పత్రికాముఖంగా మండల సిపిఎం పార్టీ కన్వీనర్ గురిజాల శ్రీధర్ కాంగ్రెస్,ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరుగుతుంది.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ తీవ్రగాయాలు

ముధోల్:16మార్చ్(తెలంగాణ పత్రిక)



రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలైన ఘటన బాసర -బైంసా జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని గన్నోర గ్రామానికి చెందిన పత్తి దేవన్న, అరవింద్ లు ద్విచక్ర వాహనంపై భైంసా వైపు వెళ్తుండగా భారత్ గ్యాస్ సమీపన మూలమలుపు ఉండడంతో ఒకేసారి ద్విచక్రవాహం మళ్ళించడంతో కారు, ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొంది. దీంతో పత్తి దేవన్న, అరవింద్ లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులుని 108 అంబులెన్స్ కి సి సమాచారం అందజేయడంతో సంఘటన స్థలానికి చేరుకొని సిబ్బంది భీమ్ రావు, గోపి లు ప్రథమ చికిత్సలను చేసి భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

ముధోల్:16మార్చ్

(తెలంగాణ పత్రిక)



మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన షాపూరి భూమన్న, ఎలుగందుల రాజు లు ఇటీవల దేగాం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. సోమవారం బాధిత కుటుంబాలను మాజీ జెడ్పిటిసి లక్ష్మి నర్సా గౌడ్ వేరువేరుగా పరామర్శించారు. దీంతో కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటానన్నారు. కష్ట సమయంలోనే ధైర్యం గా ఉండాలని తెలియజేశారు. ఆయన వెంట బోరిగాం సర్పంచ్ కల్లెడ కిష్టయ్య, మాజీ సర్పంచ్ లు లక్ష్మణ్, సత్యం, మాజీ ఎంపిటిసి పండరి, నాయకులు నారా గౌడ్ తో పాటు తదితరులున్నారు.

## చల్లా కోటయ్యకు 'సేవా రత్న' పురస్కార ప్రధానం



నడిగూడెం మార్చి 16 (తెలంగాణ పత్రిక)

హైదరాబాద్ నగరంలోని రవీంద్రభారతి వేదికగా జరిగిన 'శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకల'లో భాగంగా నడిగూడెం మండలం రత్నవరం గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది, స్వేచ్ఛ ఎన్జీవో వ్యవస్థాపకులు చల్లా కోటయ్య కి 'సేవా రత్న పురస్కారం-2026' ప్రధానం చేశారు. ?శ్లోక వాఙ్మయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉగాది పండుగను పురస్కరించుకుని ఆయన సమాజానికి చేసిన విశిష్ట సేవలను గుర్తించి ఈ గౌరవాన్ని అందించారు. న్యాయవాద వృత్తితో పాటు, సామాజిక సేవా రంగంలో ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని నిర్వాహకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## వేములవాడ పట్టణ పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

-మున్సిపాలిటీలో కొత్త ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకర్ ప్రారంభం

-21.50 లక్షలతో కొత్త వాహనాల కొనుగోలు

-ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు



వేములవాడ,మార్చి,16, తెలంగాణ పత్రిక.

వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా కొనుగోలు చేసిన రెండు ట్రాక్టర్లు మరియు వాటర్ ట్యాంకర్ ట్రాలీని సోమవారం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మున్సిపల్ కమిషనర్ మరియు పాలకవర్గ సమక్షంలో ప్రారంభించారు. సుమారు 21.50 లక్షల వ్యయంతో వీటిని కొనుగోలు చేసినట్లు చైర్మన్ ఈ సందర్భంగా తెలిపారు. పట్టణంలో మున్సిపాలిటీకి ఇప్పటివరకు 6 ట్రాక్టర్లు ఉండగా, చెత్త సేకరణకు మరిన్ని వాహనాలు అవసరమని గుర్తించి వీటిని సమకూర్చుకున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది మరియు కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ పాత రోజులు వచ్చేసాయా?
## కట్టెల పొయ్యి పెట్టాల్సిందే

-బ్లాక్ మార్కెట్ ను ఆశ్రయిస్తున్న గ్యాస్ వినియోగదారులు

-ఉగాది పండుగకు గ్యాస్ లేక దర్శనమిస్తున్న కాళీ గ్యాస్ సిలిండర్లు



మాడుగులపల్లి/నల్గొండ/మార్చి 16:(తెలంగాణ పత్రిక):-



మాడుగులపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో గ్యాస్ కొరత తీవ్రమైంది ఇజ్రాయిల్ అమెరికా ఇరాన్ యుద్ధం కారణంగా గ్రామాలలో సైతం గ్యాస్ దొరకని పరిస్థితి ఏర్పడింది. ఎక్కడ చూసినా ఖాళీ సిలిండర్లే దర్శనమిస్తున్నాయి. కట్టెల పొయ్యి పెడదామన్నా కట్టెల దొరకని పరిస్థితి ఏర్పడింది. హిందువులకు నూతన సంవత్సరమైన ఉగాది అదేవిధంగా ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే రంజాన్ పండగలు మరో రెండు మూడు రోజులు రానున్నాయి ఇరాన్ అమెరికా ఇజ్రాయిల్ యుద్ధం కారణంగా చమురు సరఫరాపై ప్రతికూల ప్రభావం పడటంతో పండగ పూట పిండి వంటలు చేసుకున్న పరిస్థితులు కనిపించడం లేవు. ఎల్పిజి సరఫరా సరిగ్గా లేకపోవడంతో ఇప్పటికే కట్టెల పోయిని ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పల్లెల్లో కట్టెల దొరకకపోవడంతో మహిళలు నానా ఇబ్బందులు పడుతున్నారు. రోజువారి పనులకు వెళ్లి వారు గ్యాస్ లేక కట్టెలు దొరకక అనేకమైన ఇబ్బందులు పడుతూన్నారు.

## ఐజ మున్సిపాలిటీలోరంజాన్ మాసం సందర్భంగా తోఫా పంపిన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి
(తెలంగాణ పత్రిక)16/03/26

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరీ సోదరీమణులకు తోఫాలను పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది

మాజీ ఎమ్మెల్యే ఏఐసీసీ సెక్రెటరీ చతిస్గడ్ ఇంచార్జ్ సంపత్ కుమార్ ఆదేశాల మేరకు జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మున్సిపాలిటీలో 19 వార్డ్ నందు మాసూమ్ పీర్ దర్గాలో మత పెద్ద సమక్షంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ముస్లిం రంజాన్ పవిత్ర మాసంలో ఉపవాసాలు ఉండే ఆర్థికంగా బలహీన వర్గాల కుటుంబాలకు సహాయంగా రంజాన్ తోఫాలను



పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప మరియురాష్ట్ర అధికార ప్రతినిధి కౌన్సిలర్ మాస్టర్ షేక్షావలి ఆచారి కౌన్సిలర్ ఎస్ మద్దిలేటి, కౌన్సిలర్స్ ఫర్హీన్ తప్సం మహబూబ్ పాషా, సంతోషమ్మ మైనర్ బాబు, రాధాకృష్ణ ముందుగా ముస్లిం కుటుంబ సభ్యులకు మత పెద్దలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది ముస్లిం కుటుంబ సభ్యులు



మత పెద్దలు హర్షం వ్యక్తం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రాజు నారాయణ, ఖాజా ,ముస్లిం మత పెద్దలు తోల అజీజ్, మన్నను, షర్ఫుద్దీన్ ,జాఫర్ ,డబ్బా సలీం, తుపత్రాల పాండురంగ ,కొండ, లక్ష్మన్న ,ఏక్లాస్ పురం జాంగిర్, జహీర్ ,కాంగ్రెస్ పార్టీ మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ షాలు ,కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కురువ వీరేష్ తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

# వేములవాడలో వెల్లివిరిసిన సోదరభావం

-ఎం.ఏ. సమీర్ ఆధ్వర్యంలో గ్రాండ్ దావత్-ఏ-ఇఫ్తార్'

వేములవాడ, మార్చి,16, తెలంగాణ పత్రిక.

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని వేములవాడ పట్టణంలో 'గ్రాండ్ ఇఫ్తార్' విందు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా నిర్వహించబడింది. పట్టణ మాజీ ఖాజీ, దివంగత జనాబ్ హబీబ్ ఖాన్ సాహెబ్ మనవడు ఎం.ఏ. సమీర్ మరియు అసీం ఖాన్ వారి సోదరుల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక హరిహర ఫంక్షన్ హాల్లో ఈ కార్యక్రమం జరిగింది.ఈ వేడుకకు వేములవాడ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లోని 11 మసీదుల నుండి ముస్లిం సోదరులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రోజంతా ఉపవాసం ఉన్న భక్తులందరూ ఒకే వేదికపై చేరి ప్రార్థనలు నిర్వహించి, ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఇది స్థానిక ముస్లిం సోదరుల మధ్య ఉన్న ఐక్యతకు, సోదరభావానికి



నిదర్శనంగా నిలిచింది.ఈ సందర్భంగా ఎం.ఏ. సమీర్ మరియు వారి సోదరులు మాట్లాడుతూ.. తమ తాతగారు హబీబ్ ఖాన్ గారు చూపిన సేవా మార్గంలో నడవడం తమకు ఎంతో సంతృప్తిని



ఇస్తుందని తెలిపారు. తమ ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన ప్రతి ఒక్కరికీ వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ముస్లిం మత పెద్దలు లోక కల్యాణం, దేశ సౌభాగ్యం మరియు శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు (దువా) చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రముఖులు, వివిధ వర్గాల ప్రతినిధులు పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుక మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది.

## ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలని కోరుతూ కలెక్టర్ కు వినతి పత్రం

కోదాడ, మార్చి 16(తెలంగాణ పత్రిక):



కోదాడ ఇంజనీరింగ్ కాలేజెస్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాలు విడుదల కావడంలో దీర్ఘకాలంగా జరుగుతున్న ఆలస్యాల వల్ల అధ్యాపకులు ఎదుర్కొంటున్న తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల గురించి సూర్యాపేట జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందించడం జరిగినది. సూర్యాపేట జిల్లా కు చెందిన అధ్యాపక సభ్యులము , రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాలను విడుదల చేయడంలో సంవత్సరాలుగా జరుగుతున్న ఆలస్యాల కారణంగా మేము ఎదుర్కొంటున్న తీవ్రమైన ఆర్థిక మరియు వ్యక్తిగత సంక్షోభాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకొని రావడం జరిగినది. ప్రైవేట్ కళాశాలలలో పనిచేసే అధ్యాపకులు తమ కుటుంబాలను పోషించడానికి మరియు ప్రాథమిక అవసరాలను తీర్చుకోవడానికి పూర్తిగా నెల జీతాలపై ఆధారపడతారు. సాధారణ పరిస్థితుల్లో జీతాలు కొన్ని వారాలు లేదా ఒక నెల ఆలస్యమైనా మేము చాలా కష్టంతోనైనా నిర్వహించగలుగుతాము. కానీ ప్రస్తుతం పరిస్థితి భరించలేనిదిగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అనేక కళాశాలలలో, మా కళాశాల సహా, జీతాలు ఐదు నెలలకుపైగా ఆలస్యమవుతున్నాయి. కొన్ని సంస్థలలో భారీ ట్యూషన్ ఫీజులు ఉన్నప్పటికీ కేవలం 30% నుండి 60% వరకు మాత్రమే జీతాలు చెల్లిస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల ఆలస్యమవుతున్నదనే కారణంతో జీతాలు కూడా రీయింబర్స్‌మెంట్ వచ్చిన తర్వాత మాత్రమే చెల్లిస్తామని యాజమాన్యాలు సర్క్యులర్లు జారీ చేస్తున్నాయి. ఈ పరిస్థితి అధ్యాపక సమాజాన్ని తీవ్రమైన ఆర్థిక కష్టాల్లోకి నెట్టింది. మా కుటుంబాల జీవితం మరియు సంక్షేమం ప్రమాదంలో పడింది. మాలో చాలా మంది ఇంటి అద్దె, విద్యుత్ బిల్లులు మరియు రోజువారీ ఖర్చులను కూడా తీర్చలేకపోతున్నారు. ఇంటి యజమానులు అద్దె కోసం ఒత్తిడి చేస్తున్నారు, కొన్ని సందర్భాలలో ఇళ్లు ఖాళీ చేయమని కూడా హెచ్చరిస్తున్నారు. అనేక మంది అధ్యాపకులు ఎప్పుడైనా ఇల్లు ఖాళీ చేయాల్సి వస్తుందేమో అన్న భయంతో జీవిస్తున్నారు. ఆరోగ్యం మరియు వైద్య అత్యవసర పరిస్థితులలో ఈ సమస్య మరింత బాధాకరంగా మారింది. అధ్యాపకులు తమకు, తమ తల్లిదండ్రులకు లేదా పిల్లలకు అవసరమైన వైద్య ఖర్చులను భరించలేకపోతున్నారు. డబ్బుల లేమి కారణంగా అవసరమైన చికిత్సలు వాయిదా పడుతున్నాయి, దీని వల్ల కుటుంబాలలో తీవ్ర బాధ కలుగుతోంది. అధ్యాపకుల పిల్లలపై కూడా ఈ సమస్య తీవ్ర ప్రభావం చూపుతోంది. చాలా మంది తమ పిల్లల పాఠశాల లేదా కళాశాల ఫీజులు చెల్లించలేకపోతున్నారు. ఫీజులు చెల్లించలేదని కొన్ని సంస్థలు పరీక్షలు రాయడానికి కూడా అనుమతించటం లేదు. తల్లిదండ్రులుగా మా పిల్లలు ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనడం మాకు ఎంతో బాధ కలిగిస్తోందని కలెక్టర్ దృష్టి కి తీసుకొని వచ్చారు. అధ్యాపకులపై మానసిక మరియు భావోద్వేగ భారం ప్రమాదకర స్థాయికి చేరుకుందని తెలిపారు. కావున వెంటనే ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల మొత్తాన్ని విడుదల చేసి అధ్యాపకుల సమాజాన్ని ఆదుకోవాలని కలెక్టర్ ని కోరారు. ఈ కార్యక్రమం లో కోదాడ ఇంజనీరింగ్ కాలేజెస్ స్టాఫ్ అసోసియేషన్ సభ్యులు పెరుమాళ్ళ పల్లి గాంధీ, రమేష్, నరేష్ రెడ్డి, శివాజీ, లక్ష్మణ్, స్రవంతి, రాజశ్రీ, అరుణ, ధరావత్ రవి,కృష్ణమూర్తి, మోతిలాల్, నర్సి రెడ్డి ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## మార్చి 24 లోపు ఎస్సీ యువతీ యువకులు, వార్షిక ప్రణాళిక దరఖాస్తులు సమర్పించాలి

-4 కోట్ల 60 లక్షలతో 228 యూనిట్లు జిల్లాకు కేటాయింపు

-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి,ప్రతినిధి మార్చి 16 ( తెలంగాణ పత్రిక )

మార్చి 24 లోపు ఎస్సీ యువతీ యువకులు, వార్షిక ప్రణాళిక దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ ఎస్సీ యువతీ యువకులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పలు పథకాలను ఆమోదించిందని అన్నారు. 2025-26 వార్షిక ప్రణాళికకు సంబంధించి 90 శాతం సబ్సిడీ 10 శాతం బ్యాంకు లోన్ తో లక్ష రూపాయల విలువ గల 100 టూ వీలర్ ఎలక్ట్రిక్ వాహనాలు, 70 శాతం సబ్సిడీ, 30 శాతం బ్యాంకు లోన్ తో 3 లక్షల రూపాయలు విలువ గల 71 త్రీ వీలర్ ఎలక్ట్రిక్ వాహనాలు, 7 లక్షల రూపాయలు విలువ గల 15



సోలార్ యూనివర్సల్ పంపు కంట్రోల్ సెట్ లను పెద్దపల్లి జిల్లాకు ప్రభుత్వం కేటాయించిందన్నారు. వ్యవసాయేతర పథకాలకు 21 నుంచి 50 సంవత్సరాల వయసు, వ్యవసాయ పథకాలకు 21 నుంచి 60 సంవత్సరాల వయసు ఉండాలని, అభ్యర్థులు ఆధార్ కార్డు రేషన్ కార్డు కుల ధ్రువీకరణ పత్రం, ఆధాయ ధృవీకరణ పత్రం (గ్రామీణ ప్రాంతాలలో సంవత్సరానికి లక్ష 50 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాల్లో 2 లక్షల) మించి ఉండకుండా ఉండాలని, శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ (రవాణా రంగ పథకాలకు) , పట్టాదారు పాసు పుస్తకం (సోలార్ పంప్ సెట్ కోసం కనీసం రెండు ఎకరాల భూమి ఉండాలని) దివ్యాంగ అభ్యర్థులు అయితే సదరం సర్టిఫికెట్, పాస్పోర్ట్ సైజ్ ఫోటోగ్రాఫ్ తో అభ్యర్థులు తమ దరఖాస్తును నమోదు చేయాలని అన్నారు నిరుద్యోగ ఎస్సి యువతీ యువకులు మార్చి 24 లోగా తమ దరఖాస్తులను ఆన్ లైన్ పోర్టల్ https://tgobmms.cgg.gov.in లో నమోదు చేయాలని కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎస్సి అభ్యర్థులకు ఆర్థిక సహాయ పథకాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 16, తెలంగాణ పత్రిక

వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్, తెలంగాణ షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్, హైదరాబాద్ వారు 12-03-2026 న ఎస్.సి కార్యాచరణ ప్రణాళిక 2025--26 ను విడుదల చేశారు. ఈ కార్యాచరణ ప్రణాళికలో బ్యాంకు అనుసంధానంతో ఆర్థిక సహాయ పథకాలను ప్రకటించారు.

పథకాల వివరాలు:

1. రవాణా రంగం పథకం క్రింద
   విద్యుత్ ద్విచక్ర వాహనన్ని
   విద్యుత్ త్రిచక్ర వాహనన్ని
2. వ్యవసాయ పథకాలు క్రింద

సౌర శక్తితో నడిచే యూనివర్సల్ పంప్ నియంత్రణ పరికరం కాబట్టి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని మండలాలు మరియు మున్సిపాలిటీ పరిధిలోని షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులు ఈ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. వ్యవసాయేతర పథకాల కోసం వయస్సు 21 నుండి 50 సంవత్సరాల మధ్య ఉండాలి. వ్యవసాయ ఆధారిత పథకాల కోసం



వయస్సు 21 నుండి 60 సంవత్సరాల మధ్య ఉండాలి. అభ్యర్థులు మార్చి 17, 2026 నుండి మార్చి 24, 2026 వరకు అంతర్జాలం ద్వారా లేదా మీ సేవా కేంద్రాల ద్వారా నమోదు చేసుకోవచ్చు. అభ్యర్థుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1,50,000 లోపుగా ఉండాలి. పట్టణ ప్రాంతాలు (మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్, నగర పంచాయతీలు)లో నివసించే వారికి రూ. 2,00,000 లోపుగా ఉండాలి.

దరఖాస్తు చేసుకోవడానికి అవసరమైన పత్రాలు:

1. ఆధార్ కార్డు
2. రేషన్ కార్డు / ఆహార భద్రత కార్డు
3. కుల ధృవీకరణ పత్రం (మీ సేవా ద్వారా జారీ చేసినది)
4. ఆదాయ ధృవీకరణ పత్రం (మీ సేవా ద్వారా జారీ చేసినది)
5. శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ (రవాణా పథకాల కోసం)
6. విద్యుత్ ద్విచక్ర వాహనాల కోసం ఎస్.సి వ్యవస్థాపకులు మరియు గిగ్ కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. సంబంధిత సంస్థల నుండి ధృవీకరణ పత్రం సమర్పించాలి.
7. పట్టాదార్ పాస్‌బుక్ (సౌర పంప్ సెట్ కోసం కనీసం రెండు ఎకరాల భూమి ఉండాలి)
8. సదరం ధృవీకరణ పత్రం (వికలాంగులకు)
9. పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో

జిల్లా కలెక్టర్ మరియు చైర్మన్
జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంఘం లిమిటెడ్
రాజన్న సిరిసిల్ల జిల్లా

## ప్రజావాణి ని గ్రామస్తులు సద్వినిగం చేసుకోవాలి సర్పంచ్ బానోతు నిర్మల వెంకన్న

ఏటూరునాగారం, ఐటిడిఏ (ములుగు) మార్చి 16 తెలంగాణ పత్రిక ములుగు జిల్లా స్టాపర్:

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం గాంధీనగర్గ్రామపంచాయతీలో సర్పంచ్ బానోతు నిర్మల వెంకన్న ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ నుండి లైన్ ఇన్స్పెక్టర్ రామచందర్ పోలీసు శాఖ నుండి విలేజ్ పోలీస్ ఆఫీసర్ నరోత్తం రెడ్డి ఏఎస్ఐ



హాజరైనారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని సమస్యలనుపరిష్కరించుకోవడానికి ప్రజావాణి మంచి వేదిక అని ఈ అవకాశాన్ని గ్రామస్తులు సభ్యులు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి భారతి, ఉప సర్పంచ్ వల్లపు మహేష్, వార్డు సభ్యులు, కూరాకుల సురేష్, లాకావత్ ఈర్య, లిక్కి కుమారస్వామి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు

-బాలల హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత.

-అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు.

ఏటూరునాగారం, ఐటిడిఏ (ములుగు) మార్చి 16 తెలంగాణ పత్రిక ములుగు జిల్లా స్టాపర్:

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాలలో భాగంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా స్థాయి బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సమావేశమును జిల్లా సంక్షేమ అధికారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు హాజరై మాట్లాడుతూ మన జిల్లాలో నూతనంగా జిల్లా బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ జిల్లా బాలల పరిరక్షణ కమిటీ జిల్లా కలెక్టర్ చైర్మన్ గా 14 మంది జిల్లా అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. జిల్లాలో ఉన్న మండల, గ్రామ, వార్డు బాలల పరిరక్షణ కమిటీలను సమన్వయం పరుస్తూ జిల్లాలోని బాలలకు సంబంధించిన సమస్యలు పరిష్కరిస్తుందని అన్నారు. జిల్లాలోని బాలల రక్షణ పై అవగాహన కల్పించడం, ఆరు సంవత్సరాల పైబడిన బాలలందరూ బడికి వెళ్లేలా





చూడడం, బడి మానివేసిన పిల్లలను గుర్తించి వారిని తిరిగి బడిలో చేర్పించడం, బాలల హక్కులకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించడం, గ్రామ సభల్లో బాలల గురించి చర్చించేలా చూడటం, బాల్యవివాహాల వల్ల, పిల్లలను పనిలోకి పంపించడం వల్ల ఎదురయ్యే అనర్థాలను గుర్తించి అవగాహన కార్యక్రమాల నిర్వహిస్తూ జిల్లాలోని అన్ని గ్రామాలను బాలల స్నేహపూర్వక గ్రామంగా, బాలల ఆదర్శ గ్రామాలుగా మార్చేందుకు కృషి దిశగా జిల్లా బాలల పరిరక్షణ కమిటీ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లాలోని బాలల హక్కుల సంరక్షణ కొరకు పని చేసే జిల్లా బాలల పరిరక్షణ విభాగం చైల్డ్ హెల్ప్ లైన్ తదితర సంస్థలని పర్యవేక్షిస్తూ ఉన్నతమైన సేవలను బాలలకు అందేలాగా ఈ కమిటీ చూస్తుందనీ జిల్లా సంక్షేమ అధికారిని ప్రేమ లత తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె ఓంకార్ మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్ ద్వారా జిల్లాలో చేపట్టిన వివిధ కార్యక్రమాలను కమిటీ సభ్యులకు వివరించారు. అనంతరం అదనపు కలెక్టర్ కమిటీ సభ్యులతో కలసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వివిధ జిల్లా అధికారులు జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పశువుల గాలికుంటు టీకాలను ప్రారంభించిన సర్పంచ్ గోగుల శ్రీనివాస్ రెడ్డి

నర్సంపేట/దుగ్గొండి/మార్చి 16 తెలంగాణ పత్రిక

దుగ్గొండి మండలం మహ్మదాపురం గ్రామంలో పాడిపశువులకు గాలికుంటు టీకాలు ప్రారంభించిన సర్పంచ్ గోగుల శ్రీనివాస్ రెడ్డి ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పశువులకు సోకే ప్రధాన వ్యాధుల్లో గాలికుంటు ఒకటి. సకాలంలో వ్యాధి లక్షణాలు గుర్తించి నివారణ చర్యలు చేపట్టకపోతే పశువులు దూడలు, వాటి పాలు తాగి మృత్యువాతపడే ప్రమాదం ఉందని. ఈ నేపథ్యంలో గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, పశు సంవర్థక శాఖ సిద్ధమైందని. మార్చి 10 నుండి ఏప్రిల్ 10 వరకు వరకు 30 రోజుల పాటు ఈ వ్యాధి నివారణ టీకాలను పశువులకు వేస్తారని, ఎవరన్నా రైతులు మన గ్రామం కు డాక్టర్ వచ్చినప్పుడు మీరు అందుబాటులో లేకపోతే తప్పకుండా డాక్టర్కు గాని లేదా నాకు గాని సమాచారం చేరవేస్తే నేను వెటర్నర్ డాక్టర్ కి సమాచారం అందించి మీ పశువులకు గాలికుంటు టీకాలు వేసే విధంగా చూస్తానని సర్పంచ్ గోగుల శ్రీనివాస్ రెడ్డి గ్రామ ప్రజలకు తెలిపారు...... ఈ సందర్భంగా వెటర్నరీ డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ 4 నెలలు దాటిన ప్రతి పశువుకూ ముందు జాగ్రత్త చర్యగా ఈ టీకా వేయించాలని రైతులకు సూచించారు. తిమ్మంపేట పశు వైద్యశాల . పరిధిలో గ్రామాలు రేకంపల్లి చలపర్తి మహ్మదాపురం మద్రిపల్లి నారాయణ తండా వివిధ గ్రామాలు ఉన్నాయి, మద్రిపల్లి మహ్మదాపురం పరిధిలో 1206 పశు సంపద ఉంది. వీటికి గాలికుంటు వ్యాధి సోకకుండా ఉండేందుకు వ్యాక్సిన్ వేశామని తెలిపారు. తిమ్మంపేట సెంటర్ పరిధిలో నాతోపాటు ముగ్గురు సిబ్బంది సేవలు



అందిస్తున్నారు. ఎన్ పావని ఓ సరోజన సిహెచ్ ప్రసాద్..... అదేవిధంగా ఎవరన్నా రైతులు పాడి పశువులకు గేదెలకు టీకాలు వేయించినట్లయితే మాకు తెలియపరచాలని అన్నారు.

**వ్యాధి లక్షణాలు..**

పశువుల్లో గాలికుంటు వ్యాధి లక్షణాలను సులువుగా గుర్తించవచ్చు. పశువుల్లో తీవ్రమైన జ్వరం రావడంతో పాటు నీరసించిపోతాయి. నోటి నుంచి తీగల వలే చొంగ కారుతూ ఉంటుంది. కాలిగిట్టలు, నోటి వద్ద పుండ్లు ఏర్పడతాయి. కొద్దిపాటి ఎండకు కూడా ఇవి తట్టుకోలేవు. చూడి పశువుల్లో గర్భాస్రావం జరుగుతుంది.

**టీకాల వల్ల లాభాలు..**

నాలుగు నెలల వయసు దాటిన పశువులు, జీవాలకు ముందు జాగ్రత్త చర్యగా టీకా వేయించాలి. దీనివల్ల పాడి రైతుకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. పాల ఉత్పత్తి తగ్గకుండా ఉంటుంది. ఎడ్లలో పని సామర్థ్యం తగ్గకుండా కాపాడవచ్చు. దూడల్లో మరణాలు సంభవించవు. అవి ఆరోగ్యంగా ఎదగడానికి ఉపయోగపడుతుంది.

**సద్వినియోగం చేసుకోండి**

ప్రతి పాడి రైతూ తమ పశువుల ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. పశువులకు తప్పకుండా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలి. ఆర్థికంగా నష్టం వాటిల్లకుండా, పశు గ్రాసంలో ఇబ్బందులు కలగకుండా ఉండాలంటే టీకా వేయడం ఒక్కటే మార్గం. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

## 99 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా మొగుడంపల్లి మండల కేంద్రంలో ఉచిత వైద్య సేవలు



తెలంగాణ పత్రిక జహీరాబాద్(ప్రతినిధి), మార్చ్ 16,

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి పనులను ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా చేరువ చేసే లక్ష్యంతో "99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" కార్యాచరణలో సంక్షేమ పథకాల లబ్ధి నిజమైన అర్హులకు అందేలా చూడటం, పెండింగ్ పనులను వేగవంతం చేయడం ప్రధాన ఉద్దేశ్యంలో భాగంగా సోమవారం మొగుడంపల్లి మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్యం సేవలు ఉచిత హెల్త్ క్యాంపును మొగుడంపల్లి గ్రామ సర్పంచ్ బి.రాజు మరియు డాక్టర్ దివ్యజోతి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఇట్టి కార్యక్రమంలో స్పెషలిస్ట్ డాక్టర్లు అన్ని సేవలను అందించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాజు గారు మాట్లాడుతూ "ఆరోగ్యమే మహాభాగ్యం" అని మనిషి ఆరోగ్యంతో ఉంటేనే ఏదైనా చేయగలడని అన్నారు. కనుక దయచేసి ప్రజలు ఈ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు.

## విట్టోలి తాండ అభివృద్ధికి సహకరించాలి

-మాజీ ఎమ్మెల్యేను కలిసిన తాండవాసులు



ముధోల్:16మార్చ్(తెలంగాణ పత్రిక)

ముధోల్ మండలంలోని విట్టోలి తాండ గామాభివృద్ధికి సహకరించాలని మాజీ ఎమ్మెల్యే గడ్డి గారి విట్టల్ రెడ్డిని సర్పంచ్ కాంతారావు, తాండ వాసులు కోరారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా సర్పంచ్, తాండవాసులు కలిశారు. విట్టోలి తండా కు నూతన గ్రామపంచాయతీ బిల్డింగ్, వివో బిల్డింగ్, అంగన్వాడి కొత్త భవనం, ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ గోడ మంజూరైనట్లు మాజీ ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా రాజు తాండ లో హనుమాన్ దేవాలయం కొరకు నిధులు మంజూరు చేయాలని మాజీ ఎమ్మెల్యే కు విన్నవించారు. దీంతో స్పందించిన ఆయన దేవాదాయ శాఖ మంత్రితో మాట్లాడి త్వరలో ప్రొసీడింగ్ పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తాండావాసులు మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డికి కృతజ్ఞతలను తెలిపారు. ఈ కార్యక్రమంలో విట్టోలి తాండ వాసులు తదితరులు ఉన్నారు.

## నర్మాల అంగన్వాడిలో సామూహిక శ్రీమంతాలు



గంభీరావుపేట తెలంగాణ పత్రిక మార్చి 16

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని నర్మాల గ్రామపంచాయతీ పరిధిలోని మూడు అంగన్వాడి కేంద్రాల లోఉన్న 20 మందికి సామూహిక శ్రీమంతం పదిమంది పిల్లలకు అన్న ప్రసన్నాన్ని రైతు వేదికలో సర్పంచ్ రాజబోయిన అర్చన ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిడిపిఓ ఉమారాణి మాట్లాడుతూ గర్భవతులు పోషకాహారం ఆకుకూరలు కూరగాయలు పండ్లు పాలు గ్రుడ్లు తినాలని మానసికంగా ప్రశాంతంగా ఉండాలని తెలిపారు ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రేణుక పంచాయతీ కార్యదర్శి రుతు ఏఎన్ఎం హేమలత భారతి ఉప సర్పంచ్ సుదర్శన్ వార్డు మెంబర్లు జ్యోతి శిరీష అంగన్వాడీ టీచర్లు అంజలి పద్మ ఆయాలు తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత గాలికుంటు టీకాలు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ పద్మావతి

పోతంగల్ తెలంగాణ పత్రిక మార్చ్ 16.

పోతంగల్ మండలంలోని టాక్లీ గ్రామంలో ఆవు గేదె జాతి మూడు నెలల వయసు పైన ఉన్న పశువులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల పంపిణి కార్యక్రమాన్ని పద్మావతి సాయి కిరణ్ ప్రారంభించారు. పశువులకు ఉచితంగా టీకాలను డాక్టర్ సురేష్ కుమార్ సర్పంచ్ పద్మావతి కలసి గ్రామంలోని పశువులకు ఉచితంగా టీకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోతంగల్ మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి చందర్ మండల పశువైద్యులు డాక్టర్ సురేష్ కుమార్ సిబ్బంది సుధీర్ గౌడ్ అటెండర్లు భాస్కర్ సతీష్ గోపాలమిత్రలు సాయిలు తుకారం గ్రామ పెద్దలు సాయికిరణ్ జీవన్ రావు పశు పెంపకందారులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా నిజం



## ప్రజావాణి పిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి.

## జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు



ఏటూరునాగారం, ఐటీడీఎ (ములుగు) మార్చి 16 తెలంగాణ పత్రిక ములుగు జిల్లా స్టాపర్:

ప్రజావాణి లో వచ్చిన పిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని, జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 46 దరఖాస్తు రాగా వాటిలో భూ సమస్యలు 13, ఇందిరమ్మ ఇండ్లు 04, పెన్షన్ 06, ఉద్యోగల కల్పన 06, ఇతర శాఖలకు సంబంధించినవి 17 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంపత్ రావు మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాకాసిపేట్ ఆరోగ్య కేంద్రంలో 366మందికి వైద్య పరీక్షలు...

– తెలంగాణ పత్రిక ప్రెస్ రిపోర్టర్ మోహన్




బోధన్ మార్చి 16..

బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ లో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో 366మందివైద్య పరీక్షలు చేసుకున్నారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో జిల్లా ఉప వైద్యాధికారిణి సమత, ఆర్థోపెడిక్ వైద్యులు అంబిక, గైనికాలాజిస్ట్ హేమలత, జనరల్ ఫిజీషియన్ లక్ష్మి, పీడియాట్రిక్ అమిత, ఆప్తాల్మిక్ సంకీర్తన,డెంటల్ వినూత్న స్పెషలిస్ట్ వైద్యులచే వైద్య పరీక్షలు, అవరమైన వారికి రక్త పరీక్షలు చేశారు. వ్యాధిని బట్టి మందులను అందించిన్నట్లు ఆసుపత్రి వైద్యులు విఠల్ రాజు సోలంకి తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో బాలికలకు కరాటే శిక్షణ

-రాణి లక్ష్మీ బాయి ఆత్మ రక్ష ప్రశిక్షణ పథకం



గంభీరావుపేట తెలంగాణ పత్రిక మార్చి 16

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట్ మండలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వంలు ప్రవేశపెట్టిన రాణి లక్ష్మీబాయి ఆత్మ రక్ష ప్రశిక్షణ సెల్ఫ్ డిఫెన్స్ లొ భాగంగా కరాటే శిక్షణ ( కియో జపాన్ షాటోకెన్ కరాటే అసోసియేషన్ ఇండియా ) ముద్రకొల ఆంజనేయులు కరాటే మాస్టర్ ఆధ్వర్యంలో కొత్తపల్లి ముచ్చర్ల, మల్లారెడ్డిపేట్, లింగన్నపేట్, ప్రభుత్వ పాఠశాలలో బాలికలకు కరాటే శిక్షణ ఇవ్వడం జరిగింది ఈ సందర్భముగా కరాటే మాస్టర్ ముద్రకొల ఆంజనేయులు మాట్లాడుతు.. ఈ మధ్యకాలంలో బాలికలపై అగత్యాలు దాడులు జరుగుతుండడంతో వయసుతో సంబంధం లేకుండా దాడులను బాలికలు ఏ విధంగా ఎదుర్కోవాలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాణి లక్ష్మీ బాయి ఆత్మ రక్ష ప్రశక్షిణ అనే పథకాన్ని తీసుకొచ్చి బాలికలకు అన్ని రకాల వామప్, పంచ్స్, బ్లాక్స్, కిక్స్, స్పరింగ్, కాటస్, నేర్పించడం జరిగిందని ఇంత మంచి పథకాన్ని తీసుకొచ్చిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ కరాటే శిక్షణ కు సహకరించిన కొత్తపల్లి, ముచ్చర్ల, మల్లారెడ్డిపేట, లింగన్నపేట, ప్రధానోపాధ్యాయులకు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు పీటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఆంజనేయులు తెలిపారు ఈ కార్యక్రమంలొ కొత్తపల్లి జెడ్పి హెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు రవీందర్ నారాయణ సుధాకర్ జమున విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## ఆరు గ్యారంటీలను విస్మరించిన ప్రభుత్వం పై తహసిల్దార్ కు వినతిపత్రం అందజేత..

-బిజెపి మండల అధ్యక్షులు బత్తిని నరేష్ గౌడ్..

వీణవంక ప్రతినిధి, మార్చి 16 ( తెలంగాణ పత్రిక).




భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రా రావు ఆదేశాల మేరకు వీణవంక మండల అధ్యక్షులు , బత్తిని నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో వీణవంక మండల తహసిల్దార్ కి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్న ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఆసరా పెన్షన్ పెంపు , రైతులకు పూర్తిస్థాయి రుణమాఫీ, రైతు భరోసా, కౌలు రైతులకు 1200, మహిళలకు 2500 మహాలక్ష్మి పథకం, విద్యార్థులకు ఫీజ్ రియంబర్స్మెంట్, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు స్కూటీ, వంట గ్యాస్ సబ్సిడీ, పలు హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తూ అలాగే స్థానిక కాల్వల ప్రాజెక్ట్ గండి నిర్మాణం త్వరగా చేయాలని తాగునీరు సాగునీరు కు చాలా ఇబ్బంది అవుతుంది మండలంలో ప్రజలకు మండలంలో ఇసుక లారీలు నడవడం వల్ల ప్రజలకు చాలా ఇబ్బంది అవుతుంది. ఆ లారీలు రాత్రి పర్మిషన్ ఇయ్యాలేదని,డే టైంలో లారీలు నడవకుండా చూడాలని కోరుతున్నామని, ప్రభుత్వ దృష్టికి తీసుకవేళ్ళాలని తహసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమం ముఖ్య అతిథిగా జిల్లా అధికార ప్రతినిధి సమ్మిరెడ్డి, జిల్లా కార్యదర్శి నరసింహ రాజు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పుప్పాల రఘు,మాజీ మండలాధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి,ముత్యాల రవీందర్, పెద్ది మల్లారెడ్డి, దాసరి భాస్కర్, ఎనగంటి శ్రీనివాస్, బొంగోని సదానందం, ఎల్లా గౌడ్, మారం తిరుపతిరెడ్డి, అప్పని కొమురయ్య,మోటం శ్రీనివాస్, దామోదర్, అశోక్, హరికృష్ణ, బాపన్న తదితరులు పాల్గొన్నారు.

## పంట పొలాల సంరక్షణకు సేంద్రియ వ్యవసాయాన్ని అవలంబించాలి..

-హుజురాబాద్ ఏ డి ఏ సునీత..

వీణవంక ప్రతినిధి, మార్చి 16 ( తెలంగాణ పత్రిక).



వీణవంక మండలం బొంతుపల్లి గ్రామము లో సోమవారం ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయం లో మెలకువలు గురించి తెలియజేస్తూ, రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హుజురాబాద్ సహాయ వ్యవసాయ సంచాలకులు సునీత రైతులకు మెలకువలు, సలహాలు తెలియజేస్తూ.. రైతు సోదరులు పంట పొలాలలో రసాయనాలను తగ్గిస్తూ, సేంద్రియ వ్యవసాయాన్ని అవలంబించి పంట పొలాలను సంరక్షించాలన్నారు. అనంతరం కెవికే శాస్త్రవేత్త శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. పంట కోసిన వెంటనే తగలబెట్టరాదని, వరి కొయ్యకాళ్లను కలియ దున్నాలని, అప్పుడే భూమి సారవంతంగా మారుతుందని, వరి కొయ్యలను కాల్చడంతో భూమి నిస్సారంగా మారి పంట దిగుబడి తగ్గుతుంద న్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఏవో గణేష్ , ఇప్కో కంపెనీ ప్రతినిధి బాలాజీ , ఏఈఓ శ్రవణ్ ,సర్పంచ్ బావు సంపత్, ఉపసర్పంచ్ చదువు నర్సింహారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ చదువు జితేందర్ రెడ్డి, బావు నాగయ్య, బోయిన కిష్టయ్య, నారాయణ రెడ్డి,చదువు శ్రీనివాస్ రెడ్డి మడికొండ రమేష్ తాటికొండ గోవిందా చారి, మహంకాళి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ, యుఆర్ఎస్, ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్







-టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్. రవిప్రసాద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి డి.కృష్ణయ్య

తెలంగాణ పత్రిక వనపర్తి జిల్లా మార్చి 16:

కేజీబీవీ, యుఆర్ఎస్, ఎస్ఎస్ఎ ఉద్యోగుల సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్ యుటిఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రెండో దశ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్. రవిప్రసాద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి డి.కృష్ణయ్య మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస ప్రాథమిక వేతనం ప్రకటించాలని, హెల్త్ కార్డులను వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కేజీబీవీ, యుఆర్ఎస్, ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలను ఆరు నెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, రెండున్నర సంవత్సరాలు గడిచినా వాటిపై చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఉద్యోగులు 33 సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జాయింట్ కలెక్టర్ ఎన్. ఖీమ్యా నాయక్ కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ నాయకులు జములయ్య, సరిత, శ్రీదేవి, సునీత, కాంతమ్మ, సీఆర్పీ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుడు చంద్రశేఖర్, టీఎస్ యుటిఎఫ్ నాయకులు బి. వెంకటేష్, తిమ్మప్ప, పి.శ్రీనివాస్ గౌడ్, ఎ.వెంకటేష్, అయోధ్యరాముడు, ప్రవీణ్, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల అభివృద్ధికి ఆత్మబలమే ఆలంబన





-డా. ఎస్. సారంగపాణి సేవలు అభినందనీయం

-- ఎంఈఓ గడ్డం మంజుల

-విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్, షూస్ పంపిణీ

కరకగూడెం ఆర్సి, మార్చి 16 (తెలంగాణ పత్రిక):

విద్యార్థుల అభివృద్ధికి ఆత్మబలం ఎంతో ముఖ్యమని విశ్రాంత ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. సారంగపాణి పేర్కొన్నారు. కరకగూడెం మండలం ఎంపీపీఎస్ రేగళ్ల పాఠశాలలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు టి. సుజాత అధ్యక్షతన సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల 48 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లు, షూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డా. సారంగపాణి మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే ఆత్మవిశ్వాసం, ఆత్మబలాన్ని పెంపొందించుకొని లక్ష్యం దిశగా ఒత్తిడి లేకుండా సాధన చేయాలని సూచించారు. మహనీయుల జీవితాలు ఎప్పుడూ పూల పాన్పులుగా ఉండవని, చదువును ఆయుధంగా చేసుకుని ముందుకు సాగాలని అన్నారు. విద్యార్థుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. కరకగూడెం మండల ఎంఈఓ గడ్డం మంజుల మాట్లాడుతూ ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తి అయిన డా. సారంగపాణి క్షేత్రస్థాయిలో విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లు, షూస్ బహుకరించడం అభినందనీయమని తెలిపారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని మరింత మంది దాతలు ముందుకు రావాలని కోరారు. బట్టుపల్లి కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ టి. మోహన్ బాబు మాట్లాడుతూ విద్యార్థి ధరించే డ్రెస్ అతని వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుందని, ఆత్మన్యూనత భావాన్ని పోగొట్టి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. రేగళ్ల సర్పంచ్ బాడిశ పార్వతి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు గ్రామ ప్రజల సహకారం అవసరమని, విద్యార్థుల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి లింగంపల్లి దయానంద్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో మరింతగా జరగాలని, అందుకు డా. సారంగపాణి మార్గదర్శకులుగా నిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు యోగి రాంబాబు విద్యార్థులకు వివిధ యోగాసనాలు నేర్పించి, మానసిక మరియు శారీరక వికాసానికి అవసరమైన శిక్షణ అందించారు. అనంతరం డా. సారంగపాణి మాదన్నగూడెం ఆదివాసులను సందర్శించి పోషకాహార లోపం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కుమారస్వామి, మల్లేష్, విద్యార్థుల తల్లిదండ్రులు నాగేశ్వరరావు, సూర్యనారాయణ, తిరుపతిరావు, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల దాహార్తి తీర్చేందుకు మట్టి కుండలు

పెబ్బేరు పాఠశాలల్లో కౌన్సిలర్ సేవా కార్యక్రమం

తెలంగాణ పత్రిక వనపర్తి జిల్లా మర్చి 16 పెబ్బేరు:

వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు తాగునీటి కొరతతో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 12వ వార్డు కౌన్సిలర్ వి.సౌజన్య దిలీప్ కుమార్ రెడ్డి మట్టి కుండలను అందజేశారు. విద్యార్థుల ఆరోగ్యం, సౌకర్యం దృష్ట్యా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జయరాములు, ప్రధానోపాధ్యాయులు నరసింహ గౌడ్, చిన్న వెంకట్, ఇంద్రారావు, నరసింహ, కురుమయ్య, పీఈటీ రవి, కృష్ణయ్య, మన్నెమ్మ, జయ, సాయి గీత, సుదర్శన్, షర్మిష్ఠ, నాగమణి, మౌనిక, అరుణకుమారి





తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పెబ్బేరు గర్ల్స్ హైస్కూల్లో విద్యార్థినీల దాహార్తి తీర్చేందుకు కూడా మట్టి కుండలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సుమిత్రతో పాటు రాధారాణి, వరలక్ష్మి, భారతి, కమలమ్మ, భాగ్యచంద్రిక, శాంతాబాయి, రాధా తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు విద్యార్థుల సంక్షేమం కోసం చేపడుతున్న ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పాఠశాల సిబ్బంది పేర్కొన్నారు.

# చట్టసభల్లో రాజకీయ విలువలను పెంపొందించిన ఓంకార్

-నేడు చలో హైదరాబాద్ ను జయప్రదం చేయాలి

-ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి జబ్బర్

కామారెడ్డి, మార్చి 16, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతి నిధి)

ప్రస్తుత యుద్ధోన్మాద మతోన్మాద అవినీతికర నేరమయ ప్రలోభాల రాజకీయాల్లో విలువలను పెంపొందించేందుకు చట్టసభల్లో ఓంకార్ పాత్ర ఎంతో ఆదర్శనీయమని, ఈ క్రమంలో చట్టసభల్లో ఓంకార్ పాత్ర అనే అంశంపై మార్చి 17న హైదరాబాదు రవీంద్ర భారతిలో సభ నిర్వహిస్తున్నట్లు ఎంసిపిఐ(యు) కామారెడ్డిజిల్లా కార్యదర్శి జబ్బర్ తెలిపారు. ఈ సభను జయప్రదం చేసేందుకు పార్టీ కార్యకర్తలు నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈరోజు భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య)- ఎంసిపిఐ(యు) జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్ నరసన్న అధ్యక్షతన పార్టీ కార్యాలయం లో జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి



జబ్బార్ మాట్లాడుతూ ఓట్లు సీట్లు అధికారం సంపాదననే ధ్యేయంగా రాజకీయ విలువలను భ్రష్టు పట్టించిన విధానాలను నిరసిస్తూ, నీతి నిజాయితీ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జీవితాన్ని సర్వస్వం త్యాగం చేసిన మార్క్సిస్టు మహా నాయకుడు అమరజీవి కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ జీవిత చరిత్రను ఆదర్శ రాజకీయాలను చట్టసభలలో ఆయన పాత్రను నెమరు వేసుకునేందుకు కామ్రేడ్ ఓంకార్ గారి శత జయంతి వార్షికోత్సవాల సందర్భంగా మార్చి 17న హైదరాబాదులోని రవీంద్రభారతిలో సభ నిర్వహిస్తున్నట్లు దీనికి అధికార ప్రతిపక్ష వామపక్ష పార్టీలు సామాజిక సంఘాల ముఖ్య నాయకత్వాన్ని ఆహ్వానించినట్లు ఈ సభను జయప్రదం చేసేందుకు పార్టీ కార్యకర్తలు నాయకులు కృషి చేయాలని తగిన విధంగా సమీకరణ చేయాలని కోరారు. వర్గ సామాజిక ప్రజా ఉద్యమాలను ఉదృతం చేసి నీతి నిజాయితీ ప్రత్యామ్నాయ రాజకీయాలను పెంపొందించేందుకు కామ్రేడ్ ఓంకార్ అనుసరించిన పద్ధతులను విధానాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశాలు పార్టీ తదితరులు పాల్గొన్నారు.

# 2027 జనాభా లెక్కలపై అవగాహన కార్యక్రమం

కామారెడ్డి, మార్చి 16, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డిజిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశాల మేరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం రెండవ రోజు సంబంధిత అధికారులకు ట్రైనర్లు డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ కార్యాలయం నుండి డి. వెంకట రమణ , వి. రాజ్‌కుమార్ లు పలు అంశాలపై అవగాహన కల్పించారు. 2027 జనాభా లెక్కల నిర్వహణలో భాగంగా సంబంధిత అధికారులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనాభా లెక్కల నిర్వహణ విధానం, చట్టపరమైన నిబంధనలు , అధికారుల బాధ్యతల పై వివరంగా తెలియజేశారు. ఈ సందర్భంగా 2027 జనాభా లెక్కల పరిచయం, జనాభా లెక్కల అధికారుల పాత్ర, చట్టపరమైన నిబంధనలు, నిధుల నిర్వహణ, మానవ వనరుల



వినియోగం ప్రచార కార్యక్రమాలపై ట్రైనర్లు వివరించారు. జనాభా గణనకు సంబంధించిన పునాదిని నిర్మించే విధానాలు, భావనలు, నిర్వచనాలు , హెచ్ ఎల్ వోఅవలోకనం (ప్రశ్నలు 1 నుంచి 34 వరకు) గురించి అధికారులకు శిక్షణ అందించారు. అలాగే పరిచయం చేస్తూ అందులోని మాడ్యూల్స్, క్రియేటర్ , లేఅవుట్ మ్యాప్ తయారీ ద్వారా హెచ్ ఎల్.బి కార్వింగ్ విధానం గురించి వివరించారు. సీఎంఎంఎస్ద్వారా శిక్షణ నిర్వహణ, నియామక లేఖలు , ఐడి కార్డుల తయారీ, ఐడి కార్డు జారీ, లాజిస్టిక్స్ , ప్రింటింగ్ నిర్వహణపై అధికారులకు అవగాహన. కల్పించారు. అదేవిధంగా డేటా ఎంట్రీ మాడ్యూల్‌లో చేయవలసినవి , చేయకూడనివి, గ్రామం/పట్టణం/ఛార్జ్ రిజిస్టర్ల తయారీ, సీఎంఎంఎస్లో డాష్‌బోర్డ్‌ల వినియోగం వంటి అంశాలపై ట్రైనర్లు వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా 2027 జనాభా లెక్కలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అంశాలపై అధికారులకు సమగ్ర అవగాహన కల్పించబడుతున్నదని తెలిపారు.

ఈ శిక్షణ లో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు మధుమోహన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవో వీణ, తహసిల్దార్ లు, ఎంపిడిఓ లు, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గంభీరావుపేటలో ఇక సహించదు తెలంగాణ.. సేవ్ తెలంగాణ పేరుతో బిజెపి ధర్నా

-బిజెపి మండల అధ్యక్షులు కోడి రమేష్ ఆధ్వర్యంలో

గంభీరావుపేట తెలంగాణ పత్రిక మార్చి 16

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జిల్లా పార్టీ అధ్యక్షుల పిలుపుమేరకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం చెందినందుకు ఇక సహించదు తెలంగాణ -- సేవ్ తెలంగాణ ధర్నా కార్యక్రమాలకు పిలుపునివ్వడంతో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు కోడె రమేశ్ ఆధ్వర్యంలో స్థానిక తాహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహసిల్దార్ మారుతి రెడ్డికి వినతి పత్రం అందించారు ఈసందర్భంగా మండల అధ్యక్షులు కోడె రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీలు కల్యాణ లక్ష్మి తులం



బంగారం, రైతులకు రైతు భరోసా, రైతు కూలీలకు 12 వేల రూపాయలు, విద్యార్థినిలకు ఎలక్ట్రికల్ స్కూటీలు గ్యాస్ సబ్సిడీ 500 రూపాయలు గృహజ్యోతి 200 యూనిట్లు అర్హులైన వారికి అమలు చేయడంలో ఇందిరమ్మ గృహాల బిల్లుల చెల్లింపు వంటి వాటిలలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని పేర్కొన్నారు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే రానున్న రోజుల్లో భారతీయ జనతా పార్టీ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్ కార్యదర్శిలు దుర్గేష్ యాదవ్ రాజు శక్తి కేంద్రం ఇన్చార్జులు బూత్ అధ్యక్షులు సీనియర్ నాయకులు డాక్టర్ సత్యనారాయణ సర్వోత్తమ్ ఆంజనేయులు దేవయ్య కృష్ణ కాంత్ యాదవ్ శ్రీనివాస్ అంజన్ రావు దేవేందర్ యాదవ్ దేవరాజు రవీందర్ నాయక్ నర్సింలు ఎల్లం రాజు తిరుపతి ప్రశాంత్ రావు మల్లేష్ గౌడ్ శివ చంద్రం యాదవ్ తిరుపతి నవీన్ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహణ

-ఎంఈఓగా ప్రణీత, ప్రధానోపాధ్యాయుడిగా అభిలాష్

తెలంగాణ పత్రిక వనపర్తి జిల్లా మర్చి16:

పెబ్బేరు మండలం బున్యాదిపూర్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు పాఠశాల నిర్వహణ బాధ్యతలను స్వయంగా చేపట్టి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓగా ప్రణీత, ప్రధానోపాధ్యాయుడిగా అభిలాష్ వ్యవహరించగా, ఉపాధ్యాయులుగా కీర్తి, సిద్ధు, శ్రావణి, జస్మిత, వర్షిని, చరణ్, ఋషి కుమార్, వెంకటరమణ, శివాని,



ఇందు, సిద్ధాంత్, శశాంక్ తదితరులు పాఠశాల కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ విజయ్ గౌడ్, అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ విజయలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను అభినందించారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయులు దయానంద్, దుర్గాప్రసాద్, కీర్తి, అనురాధ, రజిత తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగశేషు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కామారెడ్డి ప్రజావాణిలో 114 దరఖాస్తులు

-అదనపు కలెక్టర్ లోకల్ బాడి మధుమోహన్.



కామారెడ్డి ,మార్చి 16, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కామారెడ్డి కలెక్టరేట్‌లోని 25వ నంబర్ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో లోకల్ బాడీ అదనపు కలెక్టర్ మధుమోహన్ పాల్గొని దరఖాస్తుదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన దరఖాస్తుదారుల నుండి వచ్చిన వినతిపత్రాలను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు అందజేశారు. ప్రజల సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. శాఖల వారీగా దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన దరఖాస్తులు 114 వచ్చాయని , అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో సీఈఓ చందర్, ఏవో, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి

-రొండి శ్రీనివాస్ సిఐటియు జిల్లా నాయకులు



మాడ్గులపల్లి/నల్గొండ/మార్చి 16:(తెలంగాణ పత్రిక):-

మాడుగులపల్లి మండలంలోని గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న సిబ్బందికి కొన్ని గ్రామపంచాయతీలలో వేతనాలు ఇవ్వకుండా నూతన పాలకవర్గం ఇబ్బంది పెడుతున్నారు కావున నూతన పాలకవర్గాలు కూడా క్రింది స్థాయి నుండి వచ్చినవారు ఉన్నారు. మీకంటే ముందు చాలామంది పాలకులు పరిపాలన చేశారు. కానీ కార్మికుల పొట్ట కొట్టే పని చేయలే అలా కార్మికుల పొట్ట కొట్టిన ఏ పాలకవర్గం నిలబడ్డ దాఖలాలు ఎక్కడ లేదు. కాబట్టి మీరు గ్రామపంచాయతీ సిబ్బందికి పెండింగ్లో ఉన్న వేతనాలు వెంటనే ఇవ్వండి. పంచాయతీ కార్యదర్శులు కూడా చొరవ తీసుకొని సిబ్బందికి వేతనాలు ఇవ్వవలసిందిగా కోరనైనది. అలాగే రేపు రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పంచాయతీ కార్మికులకు పిలుపునివ్వడం జరిగింది. దానిలో భాగంగా మండల ఎంపీ ఓ సంగీత మేడం కి వినతిపత్రం ఇవ్వటం జరిగింది. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ అధ్యక్షులు కొండేటి నరసింహ, మండల కార్యవర్గ సభ్యులు కొలగొట్ల రాజశేఖర్, వెంకన్న, వెంకటయ్య, రవి, నాగరాజు, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనం.. పరిశుభ్రత పై అవగాహన..

- ఐదవ రోజు కొనసాగిన ఎన్ ఎస్ ఎస్ శిబిరం


చండూరు తెలంగాణ పత్రిక మార్చి 16



నల్గొండ జిల్లా చండూరు మండలం గుండ్రపల్లి గ్రామంలో ఎన్ ఎస్ ఎస్ ప్రత్యేక శిబిరం ఐదవ రోజు నిర్వహించారు.సోమవారం ఈ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు గ్రామంలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు.స్వచ్ఛ భారత్, పర్యావరణ పరిరక్షణ,ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

శిబిరంలో భాగంగా చెత్త తొలగించడం,జిల్లా పరిషత్ పాఠశాల నుండి రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, చెట్లను తొలగించడం జరిగింది.ఈ యొక్క కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘన్ శ్యామ్, పిఓ డాక్టర్ ఐతరాజు శ్రీనివాసులు,గ్రామ సర్పంచ్ ఉజ్జిని ఉషా అనిల్ రావు, గుండ్రపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, కళాశాల సిబ్బంది బాలసైదులు, శ్రీనివాస్,వెంకటేశ్వర్లు,వెంకన్న,జ్యోతి,పద్మజ,ప్రమీల,సంధ్య, సునీత,ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

# స్వయంభు మహాదేవాలయంలో మహా అన్నదాన కార్యక్రమం



పోతంగల్ తెలంగాణ పత్రిక మార్చి 16.

పోతంగల్ మండలంలోని కారేగాం గ్రామంలో స్వయంభు మహా దేవాలయం లో సోమవారం నాడు గ్రామ సర్పంచ్ నరహరి సునీల్ శివుడికి ప్రత్యేక పూజ అభిషేకాలు ఘనంగా నిర్వహించారు.అనంతరం భక్తుల కొరకు మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆయన దాతగా ముందుకు వచ్చి చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్థానిక పూజారితో పాటు అధికారులకు ప్రజా ప్రతినిధులకు సర్పంచ్ చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండలాల మార్కెట్ కమిటీ చైర్మన్ గాయక్వాడ్ హనుమంతు బాకర్ ఫారం సర్పంచ్ కనక మేడల శ్రీనివాసరావు కారేగాం సర్పంచ్ నరహరి సునీల్ చేతన్ నగర్ సర్పంచ్ కాంత సునీల్ హెగ్డోలి సర్పంచ్ నాగరాజు ఉప సర్పంచులు సతీష్ రాంబాబు వార్డు మెంబర్ ఉత్తమ్ ఆలయ కమిటీ చైర్మన్ నాగ్ నాథ్ పటేల్,ఈర్వంత్ రావు పటేల్ అధికారులు తహసిల్దార్ రంజిత్ కుమార్ ఎంఈఓ లోలా శంకర్ స్థానిక నాయకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రంలో అన్న ప్రసన్నలు,సన్మాన కార్యక్రమాలు.



కోటగిరి తెలంగాణ పత్రిక మార్చు 16.

కోటగిరి మండలంలోని వల్బాపూర్ అంగన్వాడి కేంద్రంలోని ఆరు నెలల నుండి ఏడు నెలల వరకు ఉన్న చిన్నారులకు అంగన్వాడి టీచర్ బాలలక్ష్మి ఆధ్వర్యంలో అన్న ప్రసన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా స్థానిక సర్పంచ్ పుష్పవతి సూపర్వైజర్ వెంకటరమణమ్మ హాజరై అంగన్వాడీ కేంద్రంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సర్పంచ్ పుష్పవతికి ఘనంగా సన్మానించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమం సందర్భంగా సూపర్వైజర్ వెంకటరమణమ్మ మాట్లాడుతూ.... అంగన్వాడి కేంద్రంలో ఉన్న చిన్నారులకు అన్న ప్రసన్న కార్యక్రమాన్ని చేపడుతూ గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు చేస్తామన్నారు. అంగన్వాడి కేంద్రం నుంచి పంపిణీ చేసే పౌష్టిక ఆహారం బాల అమృతం పాలు గుడ్లు బాలింతలకు గర్భిణీలకు ఆరోగ్యంగా ఉండటానికి చాలా ఉపయోగపడుతుందన్నారు. గర్భిణీ స్త్రీలకు పుట్టబోయే బిడ్డ బలంగా జన్మనిస్తూ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పుష్పావతి అంగన్వాడి సూపర్వైజర్ వెంకటరమణమ్మ అంగన్వాడి టీచర్ బాలలక్ష్మి ఆశ వర్కర్ గర్భిణీ స్త్రీలు బాలింతలు చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న ఇండియన్ ఆర్మీ జవాన్ గుండబోయిన రమేష్ యాదవ్..



వీణవంక ప్రతినిధి, మార్చి 16(తెలంగాణ పత్రిక ).

వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నేరెళ్ల శ్రీరామ్ కొంతకాలం క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో హాస్పిటల్ చికిత్స పొందుతూ దాదాపు 12 లక్షల రూపాయలు ఖర్చు చేశాడు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉండడంతో ప్రస్తుతం వైద్య ఖర్చులకు ఇబ్బంది ఏర్పడింది. దీంతో విషయం తెలుసుకున్న జమ్మికుంట మండలం కొరపెల్లి గ్రామానికి చెందిన ఇండియన్ ఆర్మీ జవాన్ గుండ బోయిన రమేష్ యాదవ్ తన ఇంటికి వెళ్లి 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని నేరెళ్ల శ్రీరామ్ కు అందజేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాతలు ముందుకు వచ్చి తమ వంతు సాయంగా ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

# పెండింగ్ ఫీజులను విడుదల చేయాలని కోరుతూ టిఎల్ఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేత

**-ఫీజు బకాయలు రాకపోతే చాక్ డౌన్ చేస్తాం**

**-టిఎల్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బాలు**

కామారెడ్డి ,మార్చి 16, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

తెలంగాణ లెక్చరర్ల ఫోరం టిఎల్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయాలని కోరుతూ ప్రజావాణిలో వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా టిఎల్ఎఫ్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాలు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 8 వేల కోట్ల రూపాయల ఫీజు బకాయిలు పెండింగ్లో ఉండడం వలన వివిధ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు వేతనాలు సరిగా పొందక తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కోవడం జరుగుతుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి పెండింగ్ ఫీజు బకాయిలను



విడుదల చేసి అధ్యాపకులకు,విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. టిఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన విధానాలనే కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తుందని, ఈ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న గతంలో చెప్పినట్లుగా పెండింగ్ బకాయిలను విడుదల చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలని అన్నారు,ఫీజు బకాయిలను విడుదల



చేయకపోతే రాబోయే రోజుల్లో అధ్యాపకులు అందరం కలిసి చాక్ డౌన్ నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సురేష్,బాల్ రెడ్డి,ప్రభాకర్,మురళి,నరేష్ కుమార్,మోహన్,భాస్కర్, మహిపాల్,సయ్యద్,శ్రీనివాస్, అఖిల్,సతీష్ కుమార్,రాజేష్ అంజయ్య,నర్సింలు,దేవరాజ్ అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# ఐక్య తల్లిదండ్రుల సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**-మహిళల సాధికారతకు అవగాహన అవసరం**

**-- మెందు రాజమల్లు**

కొత్తగూడెం ప్రతినిధి, మార్చి 16 (తెలంగాణ పత్రిక):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఐక్య తల్లిదండ్రుల సంఘం మహిళా శిశు సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ విభాగం అధ్యక్షురాలు భీమవరపు మాలతి ఆధ్వర్యంలో, కొత్తగూడెం పట్టణ కమిటీ అధ్యక్షురాలు గుమ్మడి శాంత అధ్యక్షతన, పట్టణ ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి సుజాత నిర్వహణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ప్రత్యేక న్యాయాధికారి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి మెందు రాజమల్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా ఐక్య తల్లిదండ్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మారుతీ రత్నాకర్, ఏటెక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమయ్య పాల్గొన్నారు. గౌరవ అతిథులుగా ఐక్య తల్లిదండ్రుల సంఘం జిల్లా అధ్యక్షులు లోగాని శ్రీనివాస్, ఏటెక్ జిల్లా అధ్యక్షులు మాలోతు బాలు, టీటీవా రాష్ట్ర అధ్యక్షులు హథీరామ్ నాయక్, ఐక్య తల్లిదండ్రుల సంఘం జిల్లా న్యాయ సలహాదారు ఆర్తి మక్కడ్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు పామర్తి అంకినీయుడు ప్రసాద్, సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు మునీల, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రత్నకుమారి,



దిశా మహిళా రక్షణ సంక్షేమ సంస్థ జిల్లా అధ్యక్షురాలు మాధవి లత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెందు రాజమల్లు మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టేందుకు అనేక చట్టాలు మహిళలకు అందుబాటులో ఉన్నాయని, పోలీసు యంత్రాంగం సహకారంతో చట్టపరమైన రక్షణ పొందవచ్చని తెలిపారు. ఒక పురుషుడికి విద్యను అందిస్తే అది ఒక్క వ్యక్తికే పరిమితం అవుతుందని, కానీ ఒక మహిళకు విద్యను అందిస్తే ఒక తరం మారుతుందని అన్నారు. మహిళలు తమ హక్కులు, సాధికారతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. రాష్ట్ర అధ్యక్షులు మారుతీ రత్నాకర్ మాట్లాడుతూ ఆడపిల్లల సంరక్షణే సమాజ పునాది అని పేర్కొన్నారు. ప్రతి ఆడపిల్లకు విద్య, ఆరోగ్యం అందేలా చూడటం సమాజ బాధ్యత అని తెలిపారు. మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా ఎదగాలని, ప్రభుత్వం అందిస్తున్న



ప్రోత్సాహాలను వినియోగించుకోవాలని సూచించారు. మహిళా శిశు సంక్షేమ విభాగం జిల్లా అధ్యక్షురాలు భీమవరపు మాలతి మాట్లాడుతూ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు, సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. మహిళల భద్రత, అభివృద్ధి లక్ష్యంగా సంఘం పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్య తల్లిదండ్రుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుమలాపురం సత్యనారాయణ, బోని శారద, కురిమెళ్ళ శంకర్, జిల్లా సంయుక్త కార్యదర్శులు వేణు మహేష్, నయీం, సంఘం సభ్యులు మారపాక కృష్ణస్వామి, నీరుకొండ మాలతి, ఆశు, మీనాకుమారి, భార్గవి, బందెల భారతి, హరికృష్ణ, మతిన్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో సంఘం సభ్యులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

**-ప్రజావాణిలో కలెక్టర్ కు మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి రైతులతో కలిసి వినతి.**

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) మార్చి 16

ఈ సందర్భంగా రైతులతో కలిసి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాజీమంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి మాట్లాడుతూ జగిత్యాల జిల్లా లో సుమారు 50 వేల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగుచేస్తున్నారు.వరికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు.మొక్క జొన్న రైతులు వన్య ప్రాణుల బెడద,ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొని పంట సాగు చేస్తున్నారు.కొనుగోలు కేంద్ర ల ఏర్పాటు లో జాప్యంతో రైతులకు కనీస మద్దతు దర రూపాయలు2400 దక్కడం లేదు.ఏటా ఈదురు గాలులు, వడగళ్ల వానతో మొక్కజొన్న రైతులు పంట



నష్టపోతున్నారు. రాష్ట్రంలో పంటల బీమా పథకం అమలులో లేకపోవడంతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వమే పరిహారం అందజేయాలి.మొక్క జొన్న రైతులు ఎకరానికి 30 వేలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తున్నారు.పంట చేతికి వచ్చిన కొనుగోలు కేంద్రాల ఏర్పాటు పై ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడంతో, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు జాప్యంతో రైతులకు కనీస మద్దతు ధర పొందలేకపోతున్నారు.ప్రతి క్వింటాల్ పై రైతు రూ.500 చొప్పున సుమారు 30 క్వింటాళ్లకు ఎకరానికి సుమారు 15000 నష్టపోతున్నారు.ఉమ్మడి రాష్ట్రంలో వై ఎస్ రాజశేఖర్ రెడ్డి మార్కెఫేడ్ ఆద్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారనీ గుర్తు చేశారు. పంట సాగు చేసే సమయంలోనే పరిమితి లేకుండా రైతులకు భరోసా కల్పించేలా రైతు భరోసా పంట సాగు చేపట్టేందుకు రైతు భరోసా నిధులు విడుదల చేయాలి.కనీస మద్దతు ధర కల్పించడంతోపాటు కోతుల బెడద నివారించేందుకు చర్యలు చేపట్టాలి.గతంలో మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలు నిర్వహించిన చోట ఉగాది పండుగ నుండి మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గణనపై సంపూర్ణ అవగాహన అవసరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి

(తెలంగాణ పత్రిక)16/03/26

జనాభా లెక్కల ప్రక్రియలో భాగంగా మొదట ఇండ్ల గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, ఇందుకుగాను గణనపై సంపూర్ణ అవగాహన అవసరమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం గద్వాల ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లాస్థాయి చార్జ్ అధికారులు, అదనపు చార్జ్ అధికారులకు ఇండ్ల గణనపై మూడు రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జన గణన, ఇండ్ల గణన కార్యక్రమంలో భాగంగా 2026 సంవత్సరంలో మొదటి విడతలో ఇండ్ల గణన కార్యక్రమాన్ని పూర్తి డిజిటలైజేషన్ పద్ధతిలో స్మార్ట్ ఫోన్ ద్వారా చేపట్టడం జరుగుతుందని, ఇందులో భాగంగా ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి సమాచారాన్ని సేకరించి వివరాలు నమోదుచేసి ఇండ్ల జాబితా రూపొందిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియను ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు, చార్జింగ్




అధికారులు నిర్వహిస్తారని, చార్జ్ అధికారులుగా తహసిల్దార్లు, అదనపు చార్జ్ అధికారులుగా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు వ్యవహరిస్తారని తెలిపారు. . ప్రస్తుతం ఇండ్ల గణన పూర్తయితే 2027 ఫిబ్రవరిలో ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం నిర్దేశించిన 33 ప్రశ్నలను అడిగి వివరాలను నమోదు చేస్తారన్నారు. ప్రస్తుతం చేపట్టే గణన ఆధారంగానే భవిష్యత్తులో వివిధ వర్గాలకు ఆయా సందర్భాల్లో రిజర్వేషన్లు నిర్ణయించడం జరుగుతుంది కాబట్టి గణనను పక్కాగా చేపట్టాల్సి ఉందన్నారు. జిల్లాలో సుమారు 1100 మంది ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు అవసరమవుతారని, ఉపాధ్యాయులకు ఈ విధులు అప్పగించాలన్నారు. ఈ జనాభా గణనను పూర్తిగా డిజిటల్ విధానంలో చేయాల్సి ఉన్నందున 2026-2027 సెన్సెస్ ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. సెన్సెస్ ఇండెక్స్ పుస్తకాన్ని పూర్తిగా చదివి అవగాహన పెంపొందించుకోవాలని, ట్రైనర్లు వివరించే ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఇండ్ల గణన కార్యక్రమాన్ని నిర్వహించి కార్యచరణ ప్రకారం జాబితా రూపొందించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి అంశాన్ని నేర్చుకుంటూ ఏమైనా అనుమానాలు ఉన్నట్లయితే ట్రైనర్స్ ను అడిగి వెంటనే పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఆర్డిఓ శ్రీనివాసరావు, సెన్సెస్ ఆపరేషన్ జాయింట్ డైరెక్టర్ లాజర్, సిపిఓ పాపయ్య, ట్రైనర్ సుల్తాన్, సంబంధిత ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు....

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143